

చిగురిస్తున్న ఆశలు

ఆమిద్యాల లిఫ్ట్‌కు మంత్రిమండలి ఆమోదం




ఆగిపోయిన కాలువ పనులు

పనుల వేగవంతానికి నిర్ణయం

మంత్రి కేశవ్ చొరవ పట్ల రైతుల హర్షం

ఉరవకొండ, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఆమిద్యాల లిఫ్ట్ పనుల వేగవంతానికి మంత్రిమండలి ఆమోదం తెలపడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. హంద్రీనీవా సుజల స్రవంతి పథకంలో భాగంగా 34వ ప్యాకేజీ, 203 కిలోమీటర్ వద్ద మండలంలోని రాకెట్ల సమీపంలో లిఫ్ట్ నిర్మాణ పనులు చేపట్టనున్నారు. 109 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోసే ఈ లిఫ్ట్‌ను హంద్రీనీవా ఫేజ్ 2 కింద రూ.33.6 కోట్లతో నిర్మించనున్నారు. దీంతో ఉరవకొండ మండలంలోని రాకెట్లలో 2749ఎకరాలు, ఆమిద్యాలలో 3133 ఎకరాలు, కణేకల్లు మండలంలో సల్లాపురంలో 1099 ఎకరాలు, హనుమాపురంలో 8012ఎకరాల ఆయకట్టు సాగులోకి వస్తుంది. 2019లో భూసేకరణ ప్రారంభించారు. ఎకరాకు (మిగతా 4లో...)



లిఫ్ట్ పనుల నమూనా



విద్యుత్ ఉత్పత్తి ప్రారంభం

- పీఏబీఆర్‌లో రోజుకు 72 వేల యూనిట్ల ఉత్పత్తి



జల విద్యుత్ ఉత్పత్తి చేసే టర్బైన్, జల విద్యుత్ కేంద్రంలో మరమ్మతులను పరిశీలిస్తున్న జెన్‌కో ఏడీ కేశవయ్య

కూడేరు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): పీఏబీఆర్(పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్)లో రెండేళ్ల తర్వాత జల విద్యుత్ ఉత్పత్తి ప్రారంభమైయింది. జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో రెండో టర్బైన్ నుంచి ఆదివారం మధ్యాహ్నం జెన్-కో ఏడీ కేశవయ్య పర్యవేక్షణలో విద్యుత్ ఉత్పత్తికి టర్బైన్ ఆన్ చేశారు. ప్రారంభంలో డ్యాం నుంచి 500 క్యూసెక్కుల నీటితో విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించారు. ప్రస్తుతం డ్యాంలో 5.128 టీఎంసీ నీరు నిల్వ ఉండటంతో ఇరిగేషన్ అధికారులు జల విద్యుత్ ఉత్పత్తికి అనుమతించారు. దీంతో గత రెండ్రోజులుగా జల విద్యుత్ కేంద్రంలో టర్బైన్ల మరమ్మతులు చేపట్టారు. టర్బైన్లు పూర్తి స్థాయిలో పని చేస్తుండటంతో అధికారులు ఒక టర్బైన్‌తో రోజుకు 72వేల యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసేందుకు నీటిని వినియోగిస్తున్నారు. పీఏబీఆర్ డ్యాంలో జల విద్యుత్ ఉత్పత్తి అనంతరం నీటిని దిగువనున్న మిడ్ పెన్నార్ డ్యాంకు వదిలారు. గతంలో డ్యాంలో నీటి మట్టం 5 టీఎంసీలకు చేరడంతో 2022 ఆగస్టు నుంచి 2023 జనవరి వరకు 1.5కోట్ల యూనిట్లు విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. ప్రస్తుతం పీఏబీఆర్‌లోకి తుంగభద్ర డ్యాం నుంచి 210 క్యూసెక్కులు, జీడిపల్లి రిజర్వాయర్ నుంచి హంద్రీ-నీవా ద్వారా 460 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ఈ ఇన్‌ఫ్లో ఆధారంగా జల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తామని అధికారులు తెలిపారు.

వెలుగులోకి వ్యవహారాలు

శిశుగృహలో సిబ్బంది మధ్య

వర్గపోరు

- కేంద్రానికి వెళ్లని ఉన్నతాధికారులు
- శిశువులకు శాపంగా ఉద్యోగుల నిర్లక్ష్యం





సిబ్బందిని విచారిస్తున్న డీఎంహెచ్ఓ ఈబీ దేవి, శిశుగృహ కేంద్రం

శిశుమరణంపై ప్రభుత్వం

సీరియస్

- విచారణకు మంత్రి ఆదేశం

4

బాధాకరం : కలెక్టర్

అనంతపురం వైద్యం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): సిబ్బంది వర్గపోరుతో శిశుగృహలో జరుగుతున్న నిర్వాకాలు వెలుగు చూస్తున్నాయి. పిల్లల బాగోగులు విస్మరించిన సిబ్బంది వారి వ్యక్తిగత అంశాలపై కొట్టుకుంటున్నారు. డ్యూటీల విషయంపై సిగపట్లు పడుతున్నారు. ఈ వ్యవహారాలు శిశుగృహలోని సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. అయితే విషయం బయటకు పొక్కితే తమకు ఇబ్బందులు తప్పవన్న నెపంతో ఆ వీడియోను సంబంధిత సిబ్బందితో తొలగింపజేశారు. శిశువుమృతిపై జరుగుతున్న విచారణలో భాగంగా అధికారులు సీసీ కెమెరాలను పరిశీలించారు. శిశువు మృతికి సంబంధించిన వీడియోలు దొరకలేదు కానీ ఇద్దరు సిబ్బంది కుమ్ములాట మాత్రం బయటపడినట్లు సమాచారం. ఆనోట ఈనోట విషయం బయటపడటంతో సంబంధిత రికార్డు అయిన వీడియోను శిశుగృహం నిర్వాహకులు డిలీట్ (మిగతా 4లో...)

గట్టుమిట్టాడుతున్నారు..!

పట్టు తప్పిన రీ సర్వే



- పొలం గట్టు సమస్యలు తేల్చని వైనం
- వైసీపీ హయాంలో 198 గ్రామాలకే పరిమితం
- అప్పట్లో 16,829 జాయింట్ ఎల్‌పీఎంలు
- రిజిస్ట్రేషన్లు కావు.. సబ్ డివిజన్లు చేయరు..
- 9 నెలల్లో 40 గ్రామాల్లో కూడా పూర్తికాని ప్రక్రియ
- మూడో విడతలోనైనా వేగవంతమయ్యేనా..?

అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): రీసర్వే పట్టు తప్పుతోంది. భూముల విషయంలో పరిష్కారం చూపాల్సిన రీ సర్వే మరింత వివాదం రేపుతోంది. కనీసం గట్టు సమస్యలు తేల్చకుండానే పెండింగ్‌లో ఉంచుతున్నారు. రీసర్వే చేసిన ప్రతి గ్రామంలో ఎంతో కొంతమంది ఇబ్బంది పడుతూనే ఉన్నారు. తేల్చలేని వాటిని జాయింట్ ల్యాండ్ పార్శిల్ మ్యాప్(ఎల్‌పీఎం)లో ఎక్కించేస్తున్నారు. వాటిలో పడిన భూములను రిజిస్ట్రేషన్ చేయించాలంటే వీలు కావడం లేదు. కనీసం సబ్ డివిజన్ చేసుకోవడానికి కూడా కుదరడం లేదు. దీంతో సమస్యలు పరిష్కరించని రీ సర్వే ఎందుకు చేస్తున్నారని రైతులు మండిపడుతున్నారు. వైసీపీ హయాంలో వందల ఎకరాల భూములు జాయింట్ ఎల్‌పీఎంలో ఉంచారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలోనూ ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ప్రత్యేకంగా నియమించిన రీసర్వే.. డిప్యూటీ తహసీల్దార్ల కనుసన్నుల్లోనే (మిగతా 4లో...)

నేడు స్వచ్ఛాంధ్ర అవార్డుల

ప్రదానోత్సవం

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో సోమవారం మధ్యాహ్నం 3.30 గంటలకు జిల్లా స్థాయి స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నారు. సప్తగిరి సర్కిల్‌లోని అలెగ్జాండర్ హోటల్‌లో ఏర్పాట్లు పూర్తి చేశారు. కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు.

ఎద్దు కళ్లకు గంతలు కట్టి

పదెకరాల్లో విత్తనం

ఆత్మకూరు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన పాళ్యం వెంకటనారాయణరెడ్డికి చెందిన ఎద్దు కళ్లకు గంతలు కట్టి, పదెకరాల్లో వేరుశనగ విత్తనం వేశారు. రైతు దుబ్బ గోపాల్ రెడ్డి ఆదివారం విత్తాడు. ఉదయం ఆరు గంటలకు ప్రారంభించి, మధ్యాహ్నం 3 గంటలకు పూర్తిచేశాడు.



ఎద్దు కళ్లకు గంతలు కట్టి విత్తనం వేస్తున్న రైతు దుబ్బ గోపాల్ రెడ్డి

కౌన్సెలింగ్ ద్వారానే పాఠశాలల కేటాయింపు

- ఖాళీలతో అమరావతికి విద్యాశాఖ ఐటీ సెల్
- అభ్యర్థులు ఎంతమంది ఉంటే అన్నే పోస్టులు
- ఎంఈఓలు, హెచ్‌ఎంలు, టీచర్లపై నిఘా

4

టీచర్లదే బాధ్యత

- అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంలో డీఈఓ ప్రసాద్‌బాబు

అనంతపురం విద్య, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): పాఠశాలలను కాపాడుకునే బాధ్యత టీచర్లదేనని డీఈఓ ప్రసాద్‌బాబు పేర్కొన్నారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ఉపాధ్యాయభవన్‌లో పీఎస్‌హెచ్ఎంల సంఘం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా ఈఏడాది ఉత్తమ పీఎస్‌హెచ్ఎంలుగా అవార్డుపొందిన వారికి, ఉద్యోగ విరమణ పొందిన వారిని సత్కరించారు. ఈవేడుకలకు ముఖ్యఅతిథిగా డీఈఓ ప్రసాద్ బాబు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగ విరమణ పొందిన, ఉత్తమ పీఎస్‌హెచ్ఎం (ప్రాథమిక పాఠశాలల ప్రధానో పాధ్యాయులు)లను సత్కరించడం అభినందనీయమని కొనియాడారు. పాఠశాలలను కాపాడుకున్నపుడే గురువుకు(టీచర్లకు) భవిష్యత్తు ఉంటుందన్నారు. గతంలో మెగా డీఎస్సీ అంటే 40వేలు, 50వేల టీచర్ పోస్టులను భర్తీ చేయడం చూశామన్నారు. ప్రస్తుత పరిస్థితి గతానికి భిన్నంగా ఉందన్నారు. దీనిని ప్రతి టీచర్ గుర్తించుకొని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి కృషి చేయాలన్నారు. టీచర్ల సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటానని, అదే స్ఫూర్తితో టీచర్లు పనిచేసి జిల్లాకు మంచి పేరు తేవాలన్నారు. సమావేశంలో విద్యాశాఖ ఏడీ మునీర్, పీఎస్‌హెచ్ఎంల సంఘం అధ్యక్షుడు నారాయణస్వామి, ప్రధానకార్యదర్శి రమణప్రసాద్, రాష్ట్ర కార్యదర్శులు పాముల వెంకటరమణ, గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పీఎస్ హెచ్‌ఎంను సత్కరిస్తున్న డీఈఓ ప్రసాద్‌బాబు, ఏడీ మునీర్ తదితరులు

నగర పాలక సంస్థలో పట్టణ ప్రణాళిక (టౌన్ ప్లానింగ్) విభాగం నామమాత్రంగా మారిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. కీలక పోస్టులన్నీ ఖాళీగా ఉండడంతో పర్యవేక్షణ కొరవడింది. క్షేత్రస్థాయిలో పరిశీలించకుండానే అనుమతులు ఇచ్చేస్తున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఉన్న ఇద్దరు అధికారుల్లో ఒక్కరికే లాగిన్ ఆప్షన్ ఉండడంతో అనుమతుల జారీ ప్రక్రియ జాప్యమవుతోంది. సిబ్బంది కొరతతో క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొరవడింది. దీంతో ఇబ్బడిముబ్బడిగా అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి.

పట్టని ప్రణాళిక..!

- కొరవడిన పర్యవేక్షణ
- పెరిగిపోతున్న అక్రమ నిర్మాణాలు
- ఇద్దరు అధికారుల మధ్య అంతర్యుద్ధం



అనంత టౌన్‌ప్లానింగ్‌లో కీలక పోస్టులన్నీ ఖాళీ



ఆర్టీఓ కార్యాలయం సమీపాన న్యూరెవెన్యూ కాలనీలో నిర్మిస్తున్న భారీ భవనం

(ఆంధ్రజ్యోతి, అనంతపురం క్లాక్‌టవర్)

అధికారుల మధ్య సమన్వయం కొరవడడంతో అనంత నగరపాలక సంస్థలోని టౌన్‌ప్లానింగ్ విభాగం అస్తవ్యస్తంగా మారింది. ఇద్దరు అధికారుల మధ్య అంతర్యుద్ధం తారాస్థాయికి చేరింది. తాజాగా ఆన్‌లైన్‌లో వచ్చే అనుమతులు ఇవ్వడానికి లాగిన్ ఆప్షన్ ఉన్న అధికారి ద్వారా తెలుసుకోవడానికి... మరో అధికారి ప్రయత్నించిన క్రమంలో విభేదాలు మొదలైనట్లు సమాచారం. లాగిన్ ఆప్షన్ ఉన్న అధికారి సెలవులో వెళ్లడంతో విధులకు హాజరయ్యే అధికారి ఆన్‌లైన్ దరఖాస్తుల పరిశీలనకు లాగిన్ ఆప్షన్ లేక కార్యాలయంలో కాలక్షేపం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. టౌన్‌ప్లానింగ్‌లో మొత్తం 15 మంది ఉద్యోగులు ఉండాల్సి ఉండగా.. ఇద్దరు మాత్రమే పనిచేస్తుండడం గమనార్హం. ఇద్దరికీ లాగిన్ ఆప్షన్ ఇస్తే దరఖాస్తుల పరిశీలన వేగవంతమవడంతోపాటు ప్రభుత్వానికి ఆదాయం పెరిగే అవకాశం ఉంటుంది. దరఖాస్తుల పరిశీలన ఆలస్యం కావడంతో అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు పెరిగిపోతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న నిర్మాణాలను పరిశీలించి చర్యలు తీసుకునే నాథుడే కరువయ్యాడు.

ఒక్కరికే ఆప్షన్

టౌన్ ప్లానింగ్ విభాగంలో ఏసీపీ, టీపీఓ, టీపీఎస్, టీపీబీఓ పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. టీపీఓ శిరీషకే ఏసీపీ ఇన్‌చార్జి బాధ్యతలు చూస్తున్నారు. మరో టీపీఓ మంజులకు లాగిన్ ఆప్షన్ ఇవ్వలేదు. దీంతో ఇద్దరు అధికారుల మధ్య అంతర్యుద్ధం నడుస్తున్నట్లు సమాచారం. మొత్తం నగరంలో నిర్మాణాలకు ఒక్కరే లాగిన్ ఆప్షన్ వినియోగించుకుంటుండడంతో అనుమతులులేని నిర్మాణాలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయి. రోడ్లమీద వరకు నిర్మించుకోవడం, నిబంధనలకు విరుద్ధంగా కట్టడాలు చేపడుతున్నా అడిగేనాథుడే కరువయ్యాడు. ఈ విషయాలు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినా పరిష్కరించడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు లేకపోలేదు.

క్షేత్రస్థాయిలో పర్యవేక్షణాలోపం

క్షేత్రస్థాయిలో టౌన్‌ప్లానింగ్ అధికారుల పర్యవేక్షణా లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఇబ్బడిముబ్బడిగా వెలుస్తున్న అక్రమ నిర్మాణాలే ఇందుకు నిదర్శనం. నగరపాలక సంస్థ టౌన్‌ప్లానింగ్ పరిధిలో కీలక పోస్టులు ఖాళీగా ఉండడం, ఉన్న అధికారులు ఒకరిమీద ఒకరు నెట్టుకుంటుండడంతో సమస్యలు మరింత జఠిలమవుతున్నాయి. ఆన్‌లైన్‌లో వచ్చే దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిబంధనల మేరకు ఉంటే అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది. సిబ్బంది కొరతతో క్షేత్రస్థాయిలో పరిశీలించకుండానే అనుమతులు ఇచ్చేస్తున్నారు. ఉన్న ఇద్దరు అధికారులు పరిశీలించి నిబంధనల ప్రకారం నిర్మాణాలు చేపట్టేలా చూడాల్సిన బాధ్యతను విస్మరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



టౌన్‌ప్లానింగ్ విభాగం

కీలక పోస్టులన్నీ ఖాళీ

టౌన్ ప్లానింగ్‌లో ఏసీపీ, టీపీఓ, టీపీఈఎస్, టీపీబీఓ పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. టీపీఓ శిరీషకు ఏసీపీ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. టౌన్‌ప్లానింగ్‌లో ఇద్దరు ఏసీపీలు, టీపీఓ, నలుగురు టీపీఎస్‌ఎలు, టీపీబీఓలు 8మంది ఉండాలి. వీరి పరిధిలో వార్డు సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలు ఉంటారు. అనంత నగరపాలక సంస్థ పరిధిలో 74వార్డు సచివాలయాలు ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న ఒక్క టీపీఓకి ఏసీపీ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఉన్న ఒక్క టీపీఎస్‌కు లాగిన్ ఆప్షన్ లేక దరఖాస్తులు పరిశీలించే అవకాశం లేదు. దీంతో నగరంలో అనుమతి లేని భవన నిర్మాణాలు పెరిగిపోతున్నాయి. రెండు ఫ్లోర్లకు అనుమతి తీసుకుని, ఐదు కట్టేస్తున్నారు. ఖాళీ స్థలం పన్ను (వీఎల్‌టీ) చెల్లించకనే అనుమతివ్వడంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది. ఇద్దరికి లాగిన్ ఆప్షన్ ఇస్తే దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పర్యటించి పర్యవేక్షించే అవకాశం ఉంటుంది. మిగిలిన రెండు ఏసీపీ, ముగ్గురు టీపీఎస్, 8 టీపీబీఓ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

లాగిన్ ఆప్షన్ సమస్య పరిష్కరిస్తాం



టౌన్‌ప్లానింగ్ విభాగంలో పనులు వేగంగా జరగాలంటే ఇద్దరికీ లాగిన్ ఉండాలి. ప్రస్తుతం ఒక్కరికే ఆప్షన్ ఇచ్చారు. ఇద్దరికీ ఆప్షన్ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటాం. నగర పరిధిలో అనుమతి ఉంటేనే భవన నిర్మాణాలు చేపట్టాలి. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు.

-బాలస్వామి, అనంత నగరపాలక సంస్థ కమిషనర్

కౌన్సెలింగ్ ద్వారానే
పాఠశాలల కేటాయింపు

అనంతపురంవిద్య, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2025లో ఎంపికైన టీచర్లకు మ్యానువల్ కౌన్సెలింగ్ ద్వారానే పాఠశాలలు కేటాయించనున్నారు. వెబ్ కౌన్సెలింగ్ పెడితే తొలిసారి కాబట్టి ప్లేస్‌లు నమోదు చేసుకోవడానికి కొత్త టీచర్లు కొంత ఇబ్బందిపడే అవకాశాలు ఉన్నాయి. దీంతో మ్యానువల్‌గానే కౌన్సెలింగ్ నిర్వహించి పాఠశాలలు కేటాయించాలని విద్యా శాఖ కమిషనర్ నుంచి ఆదేశాలు వెలువడ్డాయి.

ఎంతమంది ఉంటే అన్ని పోస్టులే..

కొత్త టీచర్లకు ఖాళీలు(ప్లేస్‌మెంట్) చూపడంలో నిబంధనలు పెట్టారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎంపికైన వారికంటే పోస్టులు ఎక్కువ ఖాళీ ఉన్నాయి. అయితే కౌన్సెలింగ్‌లో ఆ ఖాళీలన్నీ చూపించడం లేదు. అన్ని చూపిస్తే దూర మండలాల్లో పాఠశాలల్లోని ఖాళీలు అలాగే ఉండిపోయే అవకాశం ఉంటుంది. ఇప్పటికే డి.హీరేహాళ్, గుమ్మఘట్ట, బొమ్మనహాళ్, కుందుర్పి, శెట్టూరు, మడకశిర, అగళి, రొళ్ల, అమరాపురం, గుడిబండ వంటి మండలాల్లోని అనేక పాఠశాలలో టీచర్లు లేక విద్యాబోధన కుంటుపడింది. ఇపుడు ఆపాఠశాలలకు కొత్తటీచర్లను కేటాయించి విద్యాభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నారు. అందుకే ఏ సబ్జెక్టుకు ఎంతమంది డీఎస్సీ టీచర్లు ఉంటే అన్ని పోస్టులు మాత్రమే ఖాళీలు చూపిస్తున్నారు. ఈమేరకు రాష్ట్రకమిషనర్ ఉత్తర్వులు ఇవ్వడంతో ఆ ప్రకారం ఉమ్మడి జిల్లాలో ఖాళీల వివరాలను సేకరించి, నివేదికలను తీసుకొని ఆదివారం జిల్లావిద్యాశాఖ ఐటీ సెల్ సిబ్బంది రాజధాని అమరావతికి బయల్దేరి వెళ్లారు. అక్కడ రాష్ట్రవిద్యాశాఖ కార్యాలయంలో ఖాళీల వివరాలను పరిశీలించి ఏఏ పోస్టులు ఏఏ పాఠశాలలకు కేటాయించాలో రాష్ట్ర అధికారులు నిర్ణయం తీసుకొని ఆమోదం వేయ నున్నారు. ఆతర్వాత ఆఖాళీలనే కౌన్సెలింగ్ సమయంలో రాష్ట్ర కమిషనరేట్ నుంచే మ్యానువల్ కౌన్సెలింగ్ సమయంలో డిస్‌ప్లే చేయనున్నారు. ఎట్టి పరిస్థితులలోను ఖాళీలు మార్చడానికి అవకాశం లేకుండా కమిషనర్ ఈనిర్ణయం తీసుకున్నారు.

కౌన్సెలింగ్ తర్వాత మిగులు టీచర్ల సర్దుబాటు

కొత్తటీచర్ల కౌన్సెలింగ్ ముగిసిన తర్వాత మిగులు టీచర్లను సర్దుబాటు చేయనున్నారు. నిబంధనల మేరకు విద్యార్థులు, టీచర్ల సంఖ్యను బట్టి మిగులు టీచర్లను గుర్తించి ఎక్కువగా ఉన్న ఆయా సబ్జెక్టు టీచర్లను అవసరం ఉన్న పాఠశాలలకు కేటాయించనున్నారు. ఇప్పటికే మిగులు టీచర్లు ఎక్కడెక్కడ ఉన్నారో గుర్తించి జాబితా పెట్టుకోవాలని కమిషనర్ ఆదేశాలు ఇవ్వడంతో ఆమేరకు అధికారులు జిల్లాలో మిగులు టీచర్లను సబ్జెక్టుల ఆధారంగా గుర్తించి నివేదికలు సిద్ధం చేసుకున్నారు.

అకడమిక్‌పై దృష్టి

కొత్తటీచర్ల కౌన్సెలింగ్, మిగులు టీచర్ల సర్దుబాటు అయిన వెంటనే విద్యాశాఖ కమిషనర్ అకడమిక్‌పై దృష్టి పెట్టనున్నట్లు సమాచారం. డీఈఓ, డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలు నిత్యం పాఠశాలల పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. ఇందుకు కూడా రాష్ట్రశాఖ నుంచే రోజువారి పర్యవేక్షణ సమాచారం పంపి ఆయా పాఠశాలలను తనిఖీలు చేసి ఆన్‌లైన్‌లో వాటి వివరాలు నమోదుచేసి పంపాల్సి ఉంటుంది. ఎంఈఓలు కూడా టీచర్ల మాదిరిగానే ఉదయం 9గంటలకే ఎమ్మార్సీలకు వెళ్లి, అక్కడ ముఖ హాజరు వేసుకున్న తర్వాతనే పాఠశాలల తనిఖీకి వెళ్లాల్సి ఉంటుంది. ఉదయం, సాయంత్రం విధుల్లో ఉంటూ రెండు పూటలా ఎంఈఓలు ముఖ హాజరు వేయాల్సి ఉంటుంది. అలాగే హెచ్‌ఎంలు, టీచర్ల హాజరు, ఆయా పాఠశాలల నిర్వహణ, విద్యార్థుల ప్రమాణాలపైనా తనిఖీలలో పరిశీలించనున్నారు. అవసరమైతే కమిషనర్, జేడీలు అన్నిజిల్లాలోను ఆకస్మికంగా తనిఖీలు చేయనున్నారు.

10రోజుల తర్వాత అకడమిక్‌పైనే..: ప్రసాద్‌బాబు, డీఈఓ

కొత్త టీచర్లకు శిక్షణ ముగిసేలోగానే మ్యానువల్‌గానే కౌన్సెలింగ్ నిర్వహించి, నిబంధనల మేరకు పాఠశాలలు కేటాయిస్తాం. ఆతర్వాత ఇంకా టీచర్ల కొరత ఉన్న స్కూళ్లకు మిగులు టీచర్లను సర్దుబాటు చేస్తాం, ఈప్రక్రియ పది రోజుల్లో పూర్తి అవుతుంది. అనంతరం అకడమిక్‌పై దృష్టి పెడతాం. ఎంఈఓలు, హెచ్‌ఎంలు, టీచర్ల హాజరు, వారి పనితీరు, విద్యార్థుల ప్రమాణాలను పరిశీలిస్తాం. ఇప్పటికే ఈమేరకు కమిషనర్ ఆదేశాలు ఇచ్చారు.

కమ్మ సంఘం అధ్యక్షుడిగా నాగన్న


ఉమ్మడి జిల్లా కమ్మ సంఘం కార్యవర్గం ఎన్నిక



ఉమ్మడి అనంత జిల్లా కమ్మ సంఘం నూతన అధ్యక్షుడు బాంబే డయింగ్ నాగన్న ఇతర కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

అనంతపురం అర్బన్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా కమ్మ సంఘం అధ్యక్షుడిగా బాంబే డయింగ్ నాగన్న ఎన్నికయ్యారు. నగరంలోని కమ్మభవన్‌లో ఆదివారం ఉమ్మడి అనంత జిల్లా కమ్మ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. ఉపాధ్యక్షుడిగా మాసినేని రామయ్య, కార్యదర్శిగా పాలడుగు తిప్పయ్య, సంయుక్త కార్యదర్శిగా శంకర్, కోశాధికారిగా రామకృష్ణలను ఎంపిక చేశారు. కార్యవర్గ సభ్యులుగా సరిపూటి సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు, వెంకట సుబ్బయ్య, పెద్దప్ప, కేశన్న, కొండయ్య, సీవీ కొండయ్య, శ్రీరాములు, పవన్‌కుమార్, కౌశిక్‌లను ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడు బాంబే డయింగ్ నాగన్న, ఇతర కార్యవర్గ సభ్యులకు పలువురు కమ్మకులస్థులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు బాంబే డయింగ్ నాగన్న మీడియాతో మాట్లాడుతూ కమ్మకుల సంఘం బలోపేతం కోసం అందరిని కలుపుకొని ముందుకు వెళతామన్నారు. కమ్మ కులస్థులకు ఎక్కడ ఏ ఇబ్బంది వచ్చినా, అండగా ఉంటామన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించి, పేద వర్గాలను ఆదుకునేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

డీఆర్ఎం తనిఖీలు



పనులను పరిశీలిస్తున్న డీఆర్ఎం

గుంతకల్లు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): గుంతకల్లు-అనంతపురం రైల్వే సెక్షన్‌ను, అనంతపురంలో జరుగుతున్న అమృత్ స్టేషన్ నిర్మాణ పనులను డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా ఆదివారం తనిఖీ చేశారు. ప్రత్యేక రైలులో అనంతపురం బయలుదేరిన డీఆర్ఎం రేర్ విండో ద్వారా ట్రాక్ నాణ్యతను పరిశీలించారు. అనంతపురంలో జరుగుతున్న అమృత్ స్టేషన్ సుందరీకరణ పనుల విషయంగా అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఆపరేటింగ్, ఇంజనీరింగ్, సిగ్నలింగ్ అండ్ టెలీ కమ్యూనికేషన్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి ఆత్మహత్య



కుళ్లాయప్ప (ఫైల్)

నల్లచెరువు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేర్వేరు చోట్ల రైలు కింద పడి ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్ఐ బాలకృష్ణ ఆదివారం తెలిపారు. అల్లుగుండు గ్రామానికి చెందిన కుళ్లాయప్ప(40) కొన్నేళ్ల కిందట భార్యతో విడిపోయాడు. కుమారుడు, కుమార్తె, తల్లిదండ్రులతో కలిసి జీవించేవాడు. అయితే ఏమి జరిగిందో తెలియదు కానీ శనివారం అర్ధరాత్రి గ్రామ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు.
నల్లచెరువుకు చెందిన జైదున్‌బీ(65) గ్రామ సమీపంలో రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. ఈమెకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈమె కొన్ని రోజులు కుమార్తె వద్ద, మరికొన్ని రోజులు కుమారుడి వద్ద ఉంటూ కాలం వెళ్లదీసేది. కొన్ని రోజులుగా ఈమెకు మానసిక స్థితి సరిగా ఉండేది కాదు. ఈక్రమంలోనే ఆదివారం రైలుకిందపడి మృతి చెందింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ తెలిపారు.

చిగురిస్తున్న ఆశలు

(3వ పేజీ తరువాయి)

రూ.12లక్షల పరిహారాన్ని ప్రకటించారు. అయితే తర్వాత అధికారంలో ఉన్న వైసీపీ పట్టించుకోలేదు. 2023లో మాత్రం వైసీపీ నాయకులు హడావుడిగా లిఫ్ట్ పనులకు భూమి పూజ చేశారు. పరిహారం మంజూరు చేయకపోవడంతో పలువురు రైతులు అభ్యంతరం తెలిపారు. దీంతో అక్కడక్కడ పనులు చేసి, వైసీపీ నాయకులు చేతులు దులువుకున్నారు. 5.5 కి.మీలకు గానూ 3.2కి.మీలు మాత్రమే కాలువను తవ్వారు. గత ఐదేళ్లూ ఉత్తుత్తి ప్రచారంతో కాలం గడిపారనే విమర్శలు ఉన్నాయి.

రూ.55.60 కోట్లతో కొట్టాలపల్లి ఎత్తిపోతం పథకం

గత టీడీపీ పాలనలో కొట్టాలపల్లి ఎత్తిపోతం పథకాన్ని అప్పటి ప్రభుత్వం చీఫ్‌విప్ పయ్యావుల కేశవ్ మంజూరు చేయించారు. నియోజకవర్గంలో 10500ఎకరాలకు నీరందించేలా రూ.55.60కోట్లతో ఈ పథకాన్ని నిర్మించనున్నారు. అందుకు గానూ 177కి.మీ వద్ద ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కొట్టాలపల్లి ఎత్తిపోతల పథకం ద్వారా వజ్రకరూరు, విడపనకల్లు మండలాల్లో వందల ఎకరాల బీళ్లు సాగులోకి రానున్నాయి.

మంత్రి పయ్యావుల చొరవ

గత వైసీపీ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేయగా రైతులకు ఆగిపోయిన పరిహారాన్ని అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే మంత్రి కేశవ్ రైతుల ఖాతాల్లోకి జమ చేయించారు. రాకెట్ల గ్రామంలోనే సుమారుగా 60మంది రైతులకు రూ.5కోట్లకుపైగా పరిహారాన్ని మంజూరు చేయించారు. మూడు రోజుల కిందట జరిగిన రాష్ట్ర మంత్రి మండలి సమావేశంలో ఆమిద్యాల లిఫ్ట్ ఇరిగేషన్‌కు ఆమోదం తెలిపారు. ఆమిద్యాల లిఫ్ట్ నిర్మాణం పనులు కార్యరూపం దాల్చడంలో మంత్రి పయ్యావుల కేశవ్ చొరవ పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నమ్మకం ఉంది



ఆమిద్యాలలిఫ్ట్ పనులు పూర్తి చేసి మా పొలాలకు సాగునీరు అందిస్తారన్న నమ్మకం ఉంది. కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే భూములకు పరిహారాన్ని ఇప్పించారు. 1.82ఎకరాలకు గానూ రూ.20లక్షలు పరిహారం నాకు జమ అయ్యింది. మంత్రిమండలి ఈ లిఫ్ట్‌కు ఆమోదం తెలపడాన్ని హర్షిస్తున్నాం.

-మదమంచి నరేంద్ర, రాకెట్ల రైతు

రుణపడి ఉంటాం



వైసీపీ ప్రభుత్వం మా భూములకు పరిహారం అందించే విషయాన్ని పట్టించుకోలేదు. అయితే కూటమి ప్రభుత్వం కొలువుదీరిన ఆరు నెలలకే మంత్రి చొరవ తీసుకుని, పరిహారాన్ని మంజూరు చేయించారు. ఈ ప్రభుత్వానికి రుణపడి ఉంటాం. కాలువకు నీళ్లు రావడంతో మోటార్లు వేసుకుని పంటలు పండించుకుంటున్నాం. లిఫ్ట్ పూర్తి అయితే ఆయకట్టు మొత్తం సాగులోకి వస్తుంది.

-సోంపల్లి ఎర్రిస్వామి, రాకెట్ల రైతు

సీఎం ఇచ్చిన మాటను నెరవేర్చారు



హంద్రీనీవా కాలువ వెడల్పు పనుల పరిశీలనకు వచ్చిన సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కొట్టాలపల్లి లిఫ్ట్ పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చి నెరవేర్చారు. వైసీపీ నాయకులు సాగునీటి ప్రాజెక్టులను పట్టించుకోలేదు. డిస్ట్రిబ్యూటరీకి నీళ్లు వస్తే రైతుల జీవితాలే మారి పోతాయి. కాలువలకు నీళ్లు వచ్చినప్పటి నుంచి వాణిజ్య పంటలను సాగు చేస్తున్నాం.

-బ్యాళ్ల ఈశ్వరయ్య, హోతూరు రైతు

గట్టుమిట్టాడుతున్నారు..!

(3వ పేజీ తరువాయి)

ఇదంతా జరుగుతోంది. వీటికి తహసీల్దార్, ఆర్డీఓ స్థాయిలో సైతం పరిష్కారం దొరకట్లేదు. సబ్ డివిజన్, సరిహద్దుల విషయంలో రికార్డులు పక్కాగా ఉన్నా న్యాయం కావాలంటే పైసలు ముట్టజెప్పాల్సి వస్తోంది. కొందరు రీసర్వే డీటీలు, విలేజ్ సర్వేయర్లు ఈ వ్యవహారాల్లో బాగా ఆరితేరిపోయారని సమాచారం.

198 గ్రామాలకే పరిమితం

వైసీపీ హయాంలో రీసర్వేకు శ్రీకారం చుట్టారు. ఇందు కోసం ప్రత్యేకంగా సీనియర్ అసిస్టెంట్లకు తాత్కాలిక ఉద్యోగోన్నతి కల్పించి రీసర్వే డీటీలుగా నియమించారు. వారి పరిధిలో రీసర్వే నిర్వహించారు. అప్పట్లో అనేక అక్రమాలు జరిగాయనే ఆరోపణలున్నాయి. ఒకరి భూమిలోని కొంతభూమి మరొకరి పేరు మీద ఎక్కించడం లాంటివి కోకొల్లలు. ఇక వందల ఎకరాలు జాయింట్ ఎల్‌పీఎం కింద నమోదు చేశారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టారు. వైసీపీ హయాంలో జిల్లాలో 198 గ్రామాల్లో మాత్రమే రీసర్వే చేశారు. అందులో కూడా చాలా గ్రామాల్లో రీసర్వే పూర్తి కాలేదని తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం కూడా రీసర్వే చేయిస్తోంది. ఈఏడాది జనవరి 10 నుంచి రీ సర్వే చేపట్టారు. ప్రతి మండలంలో ఎంపిక చేసిన గ్రామంలో పైలెట్ ప్రాజెక్టు కింద రీ సర్వే చేశారు. భూ యజమానుల సమక్షంలోనే రీసర్వే చేయాలనేది నిబంధన. భూముల హద్దులు పరిష్కరించాల్సిన బాధ్యత రీసర్వే డీటీలది, విలేజ్ సర్వేయర్లదే. గత తప్పిదాలను సరిదిద్దుతారనుకుంటే మళ్లీ కొత్తగా సమస్యలు తెచ్చిపెడుతుండటం గమనార్హం. వైసీపీ హయాంలో జరిగిన తప్పిదాలను ఎంత వరకు ఈ ప్రభుత్వంలో సరిదిద్దగలరనేది ప్రశ్నార్థకంగా మారింది.

అప్పట్లో 16,829 జాయింట్ ఎల్‌పీఎంలు

గత ప్రభుత్వ హయాంలో అనేక తప్పిదాలు జరిగాయి. కూటమి అధికారంలోకి వచ్చాక రెవెన్యూ సదస్సులు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించింది. వాటిలో వచ్చిన ఫిర్యాదుల్లో రైతులు అనేక సమస్యలు పేర్కొన్నారు. ప్రధానంగా 22-ఏ జాబితాలోకి అక్రమంగా ప్రజల భూములు చేర్చారనే ఫిర్యాదులొచ్చాయి. జాయింట్ ఎల్‌పీఎం కింద తమ భూములను నమోదు చేశారనే వినతులూ అందాయి. అప్పట్లో మొత్తం 1,94,596 ఎల్‌పీఎంలు నమోదు కాగా.. వాటిలో 16,829 జేఎల్‌పీఎంలు నమోదయ్యాయంటే ఎన్ని వేల ఎకరాలు ఇబ్బందుల్లో ఉన్నాయో చెప్పనవసరం లేదు.

- బుక్కరాయసముద్రం మండలం ఆకులేడులో వైసీపీ హయాంలో రీసర్వే చేశారు. సర్వే నంబరు 375లో 12 ఎకరాలు, 359/1ఏలో 28 ఎకరాలు, ఎకరాలలో అనేక తప్పిదాలు జరిగాయి. సబ్ డివిజన్ పూర్తి కాలేదు. పొలాల సరిహద్దులు కరెక్షన్ చేయలేదు. దీంతో సంబంధిత రైతులు తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా పరిష్కారం కావడం లేదు.
- అదే మండలం ఆకులేడులో సర్వేనెంబరు 360లో 30 ఎకరాలు, సర్వేనెంబరు 148లో 18ఎకరాలను జాయింట్ ఎల్‌పీఎం కింద నమోదు చేశారు. ఈ భూములను సంబంధిత రైతులు అమ్ముకోలేని పరిస్థితి దాపురించింది. రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్తే జాయింట్ ఎల్‌పీఎం కింద ఉందనీ, దానిని తొలగిస్తేనే చేయగలమని చెబుతున్నారట. రీ సర్వే డీటీ, రెవెన్యూ అధికారులను అడిగితే తమకు ఆప్షన్ లేదనీ, కలెక్టర్ చేయాలంటూ సెలవిస్తున్నారట.
- కూడేరు మండలం పి.నారాయణపురానికి చెందిన రామాంజిరెడ్డికి నలుగురు సోదరులు. వీరికి అదే మండలం తిమ్మాపురం గ్రామ సర్వే నంబరు 388లో 15.60ఎకరాలు ఉంది. రీ సర్వే పూర్తయ్యాక ఎల్‌పీఎంలు కేటాయించారు. రామాంజిరెడ్డి తన భూమి మరొకరికి విక్రయించాక ఒక తిరకాసు బయటపడింది. సోదరుల సర్వే నంబర్లు ఒకరిది మరొకరికి ఇలా మార్చి ఎల్‌పీఎంలు కేటాయించారు. దీంతో తన భూమిని తన పేరుతో చేయించుకోవడానికి రామాంజిరెడ్డి నాలుగైదు నెలల పాటు కష్టపడాల్సి వచ్చింది. దీనికి తోడు సంబంధిత అధికారులకు ముడుపులూ ఇచ్చుకోక తప్పలేదు.
- గార్లదిన్నె మండలం జంబులదిన్నె గ్రామ పరిధి సర్వే నంబరు 37లో 4.5 ఎకరాల భూమి ఉంది. సోదరులకు చెందిన ఈ భూమి జాయింట్ ఎల్‌పీఎం కింద నమోదైంది. రీసర్వే సమయంలో తామెవరూ లేకపోయినా జాయింట్ కింద నమోదు చేశారని ఆ కుటుంబం ఆరోపిస్తోంది. ఇప్పుడు సబ్ డివిజన్ చేయమంటే కుదరదంటున్నారు.

9 నెలల్లో 40 గ్రామాల్లో కూడా..


కూటమి అధికారంలోకి వచ్చాక జనవరిలో రీ సర్వే ప్రారంభించారు. మండలానికో గ్రామం చొప్పున 32 గ్రామాల్లో రీ సర్వే చేపట్టారు. 70శాతం పైలెట్ గ్రామాల్లో సైతం భూ సమస్యలు పరిష్కారం కావడం లేదనే విమర్శలున్నాయి. అనంతరం రెండో విడతలో 24 గ్రామాలు రీసర్వే చేపట్టారు. వాటిలో 50 శాతం కూడా పూర్తి కాలేదు. తాజాగా శుక్రవారం నుంచి జిల్లావ్యాప్తంగా 24 గ్రామాల్లో మూడో విడత రీసర్వే చేపట్టనున్నారు. తొలి రెండు విడతల్లో 50 శాతానికిపైగా రీసర్వే పూర్తయిందని అధికారులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి లేదని తెలుస్తోంది. సరిగా 40 గ్రామాల్లో కూడా రీసర్వే పూర్తి కాలేదనీ, పరిష్కారం కాని భూముల లెక్కలే స్పష్టం చేస్తున్నాయి.
జిల్లా కేంద్రానికి సమీపంలోని బుక్కరాయసముద్రం మండలంలో తొలుత పొడరాళ్ల గ్రామంలో చేపట్టారు. మధ్యలోనే గోవిందంపల్లిలో రీ సర్వే చేశారు. ఇక్కడా కొన్ని జాయింట్ ఎల్‌పీఎం కింద నమోదు చేశారు. ఇప్పుడు అది ఇంకా పూర్తి కాకుండానే కొత్తగా ఈనెల 3వతేదీ నుంచి చేపట్టే మూడో విడతలో దండువారిపల్లిలో చేపడుతున్నారు. విడపనకల్లు మండలం మాలాపురం, కడదరబెంచి గ్రామాల్లో వైసీపీ హయాంలో, ప్రస్తుత ప్రభుత్వంలోనూ రీసర్వే చేపట్టారు. దాదాపు 20 సర్వే నంబర్లలో అన్నదమ్ముల మధ్య పొలాల గట్టు సమస్యలు, ఒకరి సర్వేనంబరులోని భూమి, మరొకరి పేరుమీద ఎల్‌పీఎం నమోదయ్యాయి. మూడో విడత కింద మూడు డివిజన్లకూ 24 గ్రామాలే ఎంపిక చేశారంటే రీ సర్వే ఏ స్థాయిలో నడుస్తోందో అర్థం చేసుకోవచ్చు. కొన్ని గ్రామాల్లో రెండో విడత సర్వే కొనసాగుతూనే ఉందని అధికారులు చెప్పకనే చెబుతున్నారు.

డీటీలు, విలేజ్ సర్వేయర్ల వసూళ్ల పర్వం

రీ సర్వే నత్తనడకన సాగుతోంది. ఈ పరిస్థితే ఇలాగే కొనసాగితే వచ్చే ఎప్పటికి పూర్తవుతుందో అర్థంకాని పరిస్థితి. ఇప్పటి వరకు అధికారిక లెక్కల ప్రకారం ఒక్కో మండలంలో కనీసం నాలుగైదు గ్రామాలకు వించలేదు. ఇంకా 30కిపైగా గ్రామాలున్నాయి. జిల్లా వ్యాప్తంగా 400పైగా గ్రామాలు పూర్తి చేయాల్సి ఉంటుంది. అందులోనూ గత వైసీపీ హయంలో చేసిన తప్పిదాలు, అక్రమాలను ఎప్పుడు పరిష్కరిస్తారో తేలని పరిస్థితి. రీ సర్వే ముసుగులో కొందరు డీటీలు, విలేజ్ సర్వేయర్లు ముడుపులు పుచ్చుకోవడంలో బాగా బిజీ అయ్యారు. సబ్ డివిజన్లు చేసే విషయంలోనూ, సరిహద్దుల కొలతల విషయంలో సరిగా స్పందించడం లేదనే విమర్శలున్నాయి. వాటి విషయంలో పైసలిస్తేనే పనులు జరుగుతున్నాయనే ఆరోపణలున్నాయి. కొందరు డీటీలు క్షేత్రస్థాయికి వెళ్లకుండానే జాయింట్ ఎల్‌పీఎంలు నమోదు చేస్తున్నారనే విమర్శలు లేకపోలేదు.

పిల్లల గొడవ.. పెద్దల ఘర్షణ

వెంకటగిరిపాళ్యంలో ముగ్గురికి గాయాలు



తీవ్రంగా గాయపడిన గోపాల్

పెనుకొండ రూరల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): చిన్న పిల్లలు మధ్య జరిగిన చిన్న గొడవ రెండు వర్గాల మధ్య ఘర్షణకు దారి తీసిన సంఘటన వెంకటగిరిపాళ్యంలో ఆదివారం జరిగింది. ఈ దాడిలో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య తమ్ముడు గోపాల్, మరో ఇద్దరు గాయపడ్డారు. గ్రామంలో శనివారం సాయంత్రం కేశవయ్య కుటుంబ సభ్యుల పిల్లలు, తుపాకుల కుటుంబానికి చెందిన పిల్లల మధ్య చిన్న గలాట జరిగింది. కేశవయ్య తమ్ముడి కుమారుడు మల్లికార్జున ఆదివారం కారులో గుట్టూరు వైపు వెళ్తుండగా తుపాకుల కుటుంబానికి చెందిన చంద్రాయుడు, ఓబులేసు, చంద్ర, అంజి కాపుకాసి గొడవకు దిగారు. ఇది తెలుసుకున్న గోపాల్ కొందరితో కలిసి అక్కడకురాగా మూకుమ్మడిగా ఆయనపై వేటకొడవళ్లు, కర్రలతో దాడి చేశారు. దీంతో గోపాల్, మల్లికార్జున, నాగేంద్ర గాయపడ్డారు. విషయం తెలుసుకున్న గోపాల్ వర్గీయులు పెద్దసంఖ్యలో కియ పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకుని జాతీయరహదారిపై ధర్నా చేపట్టారు. దీంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అప్పటికే సీఐ రాఘవన్, ఎస్ఐ రాజేష్ దాడిచేసిన నిందితులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌లో ఉంచారు. తుపాకుల కుటుంబం, కేశవయ్య కుటుంబానికి గత కొంతకాలంగా ఉన్న పాత కక్షల నేపథ్యంతోనే ఘర్షణ జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళా హోంగార్డు ఆత్మహత్యాయత్నం

సెల్ఫీ వీడియో వైరల్



హోంగార్డును ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

గోరంట్ల, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎముకలగుట్లపల్లి సమీపంలోని పొలాల్లో మహిళా హోంగార్డు ఆదివారం విషద్రావకం తాగి ఆత్మహత్యకు యత్నించారు. గోరంట్ల అప్‌గ్రేడ్ పోలీసు స్టేషన్‌లో మహిళా హోంగార్డుగా పనిచేస్తున్న ప్రియాంకాబాయి పోలీస్ క్వార్టర్స్‌లోనే కుటుంబసభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. పట్టణ శివారు ప్రాంతంలోని డంపింగ్ యార్డ్ వద్ద పొలాల్లోకి వెళ్లి కూల్‌డ్రిక్‌లో విషద్రావకం కలుపుకొని తాగుతూ సెల్ఫీ వీడియో తీసుకున్నారు. గోరంట్లకు చెందిన కారు డ్రైవర్లు షైను, షఫీల వల్ల తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు ఆమె సెల్ఫీ వీడియోలో పేర్కొన్నారు. వారిద్దరు తనను వేధిస్తూ, తనపైన సీఐకి చాడీలు చెప్పారని, దీంతో సీఐ శేఖర్ తనను ఏమీ అడగకుండానే క్వార్టర్స్ ఖాళీ చేయమని ఆదేశించారని చెప్పారు. ఈ సెల్ఫీ వీడియోను ఆమె సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. అది కొద్దిసేపట్లోనే వైరల్ అయ్యింది. విషయం తెలుసుకున్న సీఐ శేఖర్ అక్కడికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు. ఘటనాస్థలానికి చేరుకుని, ఆత్మహత్యకు యత్నించిన హోంగార్డును ఆస్పత్రికి తరలించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం ప్రత్యేక వాహనంలో హిందూపురం తరలించారు. ఈవిషయమై సీఐ శేఖర్‌ను వివరణ కోరగా ఇతరులతో పరిచయం వల్ల వారు క్వార్టర్స్‌లోని ఇంటికి వచ్చి వెళ్లే వారన్నారు. హోంగార్డ్ ఇబ్బంది పెట్టడం వల్లే డ్రైవర్ షైను ఇటీవల ఆత్మహత్యకు యత్నించాడన్నారు. అలాగే దాదు అనే వ్యక్తితో పరిచయం పెట్టుకోవడం, వారు వేళకాని వేళ క్వార్టర్స్‌లో ఆమె ఇంటికి వస్తుండటంతో పరిస్థితి గమనించి క్వార్టర్స్ ఖాళీ చేయమని చెప్పినట్లు తెలిపారు.

స్పోర్ట్స్ కోటా పెంచిన ఘనత బాబుదే

బ్యాడ్మింటన్ పోటీల ప్రారంభోత్సవంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే



పోటీలను ప్రారంభిస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్పోర్ట్స్ కోటా రిజర్వేషన్ 3శాతానికి పెంచిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కిందని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, అనంత అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక నాయక్‌నగర్‌లో రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు ప్రాథమిక దశ నుంచే చదువుతో పాటు ఆసక్తి ఉన్న క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడలతో మానసిక, శారీరక ధృడత్వంతో పాటు స్నేహ సంబంధాలు మెరుగుపడతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బుగ్గయ్య చౌదరి, జయకుమార్, కోశాధికారి సాంబమూర్తి, నరేష్, టీడీపీ నా యకులు గంగారాం, సరిపూటి రమణ, నారాయణస్వామి యాదవ్ పాల్గొన్నారు.

వెలుగులోకి వ్యవహారాలు

(3వ పేజీ తరువాయి)

చేయించినట్లు చర్చ జరుగుతోంది.

నవ్విపోదురుగాక...

నగరంలో శిశుకేంద్రాన్ని 2011లో ప్రారంభించారు. 2014లో సిబ్బందిని నియమించారు. అయితే కేంద్రంలో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాల్లో 2000 సంవత్సరంలో వీడియో దృశ్యాలు రికార్డు అయ్యాయి. తాజా ఘటనలపై రికార్డులను వెలికి తీయించేందుకు ప్రత్యేకంగా టెక్నీషియన్‌ను పిలిపించి సీసీ కెమెరాల పనితీరును తనిఖీ చేయించారు. అందులో 2000 సంవత్సరంలోని దృశ్యాలు మాత్రమే రికార్డులో ఉన్నాయని టెక్నీషియన్ గుర్తించారు. అప్పటినుంచి నేటివరకు రికార్డులను డిలీట్ చేసి ఉండవచ్చునని అనుమానాలను వ్యక్తంచేశారు. కేంద్రంలోని కారిడార్, కిచెన్, చిల్డ్రన్ లివింగ్, ఆవరణం ఇలా ఆరు సీసీ కెమెరాలను ఏర్పాటుచేశారు. అయితే అందులో రికార్డు అయిన వీడియో రికార్డులను 2000సంవత్సరానికి మార్చినట్లు ఐడీసీఎస్ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

పర్యవేక్షణ గాలికి..

శిశుగృహ నిర్వహణ ప్రక్రియలో సీడీఎస్ పీడీ, డీసీఎం ముఖ్యపాత్ర పోషిస్తారు. నెలలో నాలుగు రోజులు తప్పనిసరిగా వీరద్దరూ శిశుగృహను సందర్శించాలి. అక్కడి పరిస్థితులను తెలుసుకుని సమస్యలను పరిష్కరించాలి. సిబ్బంది ఎవరున్నారు, విధుల వేళలు, శిశువుల ఆహారం, సంరక్షణ ఇలా ప్రతిఅంశంపై పీడీ, డీసీఎం పర్యవేక్షణ ఉండాలని ఐసీడీఎస్ వర్గాలు చెబుతున్నాయి. అధికారులు ఎప్పుడో ఒకటి, రెండు సార్లు మాత్రమే అలావెళ్లి ఇలా వచ్చేస్తున్నారు. అయితే శిశుమరణంపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించడంతో శిశుగృహను సందర్శించి, సంతకాలు పెట్టినట్లు రికార్డుల్లో తారుమారు చేయడానికి ఆ ఉన్నతాధికారులు యత్నిస్తున్నట్లు ఐసీడీఎస్ వర్గాల సమాచారం.

ఏడుగురు సిబ్బంది

కేంద్రం నిర్వహణలో మేనేజర్ కేంద్రబిందువు. ఉన్నతాధికారులను, సిబ్బందిని సమన్వయం చేస్తూ శిశువుల ఆరోగ్య సంరక్షణ సజావుగా సాగేలా వ్యవహరించాలి. ప్రస్తుత మేనేజర్ వర్గపోరును సృష్టించడం, తగువులు రాజేయడం, వివాదాలకు కేంద్రంగా మార్చడంలో ఆరితేరినట్లు ఐసీడీఎస్ వర్గాలు విమర్శిస్తున్నాయి. శిశుగృహలో ఒకరి చొప్పున మేనేజర్, నర్స్, వర్కర్, వాచ్‌మెన్‌పాటు నలుగురు ఆయాలు మొత్తం ఏడుగురు పనిచేస్తున్నారు.

త్రీమెన్ కమిటీతో నిజాలు నిగ్గు తేలేనా?

శిశువు మృతి ఘటనపై ఏర్పాటుచేసిన త్రిమెన్ కమిటీ నిజాలను నిగ్గుతేలుస్తుందా? కప్పిపెడుతుందా? అనే చర్చ ఐసీడీఎస్ వర్గాల్లో జోరుగా సాగుతోంది. నిష్పక్షపాతంగా విచారణ చేపడితేనే శిశువుల సంరక్షణ కొనసాగుతుందని, లేకుంటే అభం, శుభం తెలియని చిన్నారులు మరింత మంది మృత్యువాత పడాల్సి వస్తుందని పేర్కొంటున్నాయి.

రాష్ట్ర డైరెక్టర్ రాక

శిశుమరణంపై వాస్తవాలను నిగ్గుతేల్చేందుకు రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ వేణుగోపాల్ జిల్లాకు రానున్నారు. మంత్రి గుమ్మడి సంధ్యారాణి, కార్యదర్శి సూర్యకుమారికి వాస్తవ పరిస్థితులను వివరించేందుకు క్షేత్రస్థాయిలో పర్యటించనున్నట్లు ఆ శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.

శిశుమరణంపై ప్రభుత్వం సీరియస్

విచారణకు మంత్రి ఆదేశం

అనంతపురం వైద్యం/కలెక్టరేట్, అక్టోబరు5 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శిశుగృహాలో శిశువు మరణంపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. ఈఘటనపై మాతా, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఆదివారం విచారణకు ఆదేశించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి ప్రకటించారు. సమగ్ర విచారణ జరిపి నివేదికలు పంపాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. దీంతో జిల్లా కలెక్టర్ ఆనంద్ త్రిమెన్ కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీలోని డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి, ఐసీడీఎస్ పీడీ నాగమణి, పీడియాట్రిక్స్ డాక్టర్ ప్రవీణ్‌డీన్ విచారణ చేపట్టారు. శిశుగృహకు చేరుకుని సెంటర్ మేనేజర్, నర్స్, సోషల్ వర్కర్, ఆయాలు, వాచ్‌మన్‌ను వేరువేరుగా కమిటీ సభ్యులు విచారణ చేశారు. వారు చెప్పిన అంశాల ఆధారంగా నివేదిక రూపొందిస్తున్నట్లు సమాచారం. తుదినివేదిక సోమవారం వెల్లడికానుందని, ఆమేరకు చర్యలు తీసుకునే అవకాశాలున్నాయని అధికారులు పేర్కొన్నారు.

బాధాకరం

శిశుగృహలో పసికందు మృతి బాధాకరమని కలెక్టర్ ఆనంద్ అన్నారు. ఈ ఘటనపై వేసిన త్రీమెన్ కమిటీ విచారణ చేసి సమగ్ర నివేదిక అందజేస్తుందని ఆయన తెలిపారు. బాధ్యులపై తప్పక చర్యలు ఉంటాయన్నారు. ఈ ఘటనపై ఉన్నతస్థాయిలో ఎప్పటికప్పుడు సమీక్ష చేస్తున్నట్లు వెల్లడించారు.

గురువులను గౌరవిద్దాం: జేవీవీ



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గేయానంద్

అనంతపురం టౌన్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం నిరంతరం కృషి చేసే గురువులను గౌరవించాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర గౌరవ సలహాదారు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ సూచించారు. జేవీవీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సంగమేష్‌నగర్‌లో గల జేవీవీ కార్యాలయంలో నిర్వహించిన అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అంతర్జాతీయ విద్య వైజ్ఞానిక సాంస్కృతిక సంస్థ(యునెస్కో) అక్టోబరు 5వ తేదీని ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవంగా పేర్కొందని, 1994 నుంచి క్రమం తప్పకుండా ప్రపంచవ్యాప్తంగా 100కు పైగా దేశాల్లో ఈ దినోత్సవాన్ని జరుపుతున్నారని తెలిపారు. జ్ఞానమందించి, విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల కృషి వెలకట్టలేనిదన్నారు. అయితే ప్రస్తుతం ఉపాధ్యాయులను గౌరవించే తీరు మారుతోందని, ఇది మంచి పరిణామం కాదని తెలిపారు. ఆ వృత్తికి గౌరవం ఇవ్వాల్సిందేనని అన్నారు. జేవీవీ జిల్లా అధ్యక్షుడు కేవీ చిత్తప్ప అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా నాయకుడు అర్జున్ నాయక్, సీనియర్ నాయకుడు ఎస్ఎం బాషా, జిల్లా గౌరవాధ్యక్షురాలు డాక్టర్ ప్రసూన, ప్రధాన కార్యదర్శి వీరరాజు, నాయకులు లక్ష్మీనారాయణ, నాగరత్న, శ్రీనివాసరావు, గాంగేనాయక్, రామచంద్రుడు, తిరుపాలు, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదాయం రూ.2.95 లక్షలు

అనంతపురంరూరల్,అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన పశులసంతతో రూ.2,95,650 ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి రాఘవేంద్రకుమార్ ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా రూ.1,87,050లు, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంత ద్వారా రూ.1,08,600 లు మార్కెట్‌కు ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు.

చిత్రకారుడికి ఘన సన్మానం



చిన్నకుళ్లాయప్పను సన్మానిస్తున్న మిద్దె కుళ్లాయప్ప

నార్పల, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో ఆదివారం చిత్రకారుడు చిన్న కుళ్లాయప్పకు అభిమానులు ఘనంగా సన్మానం చేశారు. పూలమాలలు వేసి శాలువాలు కప్పి సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వైసీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిద్దె కుళ్లాయప్ప మాట్లాడుతూ.. ఈజిప్ట్‌కు చెందిన అబ్లా ఫౌండేషన్ ప్రపంచ వ్యాప్తంగా వ్యంగ్య చిత్రాల పోటీ నిర్వహించగా.. అందులో భారతదేశం తరఫున చిన్న కుళ్లాయప్ప గీసిన చిత్రాన్ని పోటీకి పంపగా ఆ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా ద్వితీయ బహుమతి సాధించడం ఎంతో గర్వకారణమన్నారు. ఇలాంటి చిత్రకారులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించి సముచిత ప్రాధాన్యత కల్పించాలని కోరారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

ఆత్మకూరు అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. వేకువజామునే అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు పలు అభిషేకాలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం పూజలు జరిపి, మహామంగళ హారతి ఇచ్చారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లుచేశారు. అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో ఈఓ బాబు, ప్రధాన అర్చకుడు రాముస్వామి పాల్గొన్నారు.

నువ్వు లేకుండా.. నేను జీవించలేను

- ఆత్మహత్య చేసుకుంటున్నట్లుగా ప్రేమికుడి సెల్ఫీ వీడియో
- అనంతరం పనిచేయని సెల్‌ఫోన్
- మిస్సింగ్ కేసు నమోదు.. ఆచూకీ కోసం పోలీసుల గాలింపు



అట్టే పోతలయ్య

రాప్తాడు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రేమించిన అమ్మాయికి వేరొకరితో పెళ్లి సంబంధాలు చూస్తుండటంతో జీర్ణించుకోలేని ప్రేమికుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లుగా సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. నువ్వు లేకుండా నేను జీవించలేను.. చనిపోతాను అని సెల్ఫీ వీడియోను పంపి ఆ తరువాత ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. ఈ ఘటన శనివారం సాయంత్రం నార్పల మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లో కెళ్తే.. రాప్తాడు మండలం పాలచెర్ల గ్రామానికి చెందిన అట్టే లింగమయ్య, మాలమ్మ దంపతుల మూడో కుమారుడు అట్టే పోతలయ్య వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. అతను నార్పల మండలంలోని ఓ గ్రామానికి చెందిన అమ్మాయిని ప్రేమించాడు. వారిరువురు దాదాపు రెండేళ్ల క్రితం ఇంట్లో తెలియకుండా ప్రేమ వివాహం చేసుకున్నారు. అయితే అప్పుడు ఆ అమ్మాయి వయసు 18 ఏళ్లు నిండకపోవడంతో నార్పల పోలీస్ స్టేషన్‌లో పెద్ద మనుషుల సమక్షంలో పంచాయతీ జరిగింది. బాలిక మైనర్ కావడంతో ఇరువురికి సర్ది చెప్పి ఎవరి ఇళ్లకు వారిని పంపించేశారు.

చనిపోతున్నానంటూ సెల్ఫీ వీడియో

ప్రస్తుతం అమ్మాయికి వివాహం చేసేందుకు పెళ్లి సంబంధాలు చూస్తున్నారన్న విషయం తెలుసుకున్న అట్టే పోతలయ్య శనివారం సాయంత్రం నార్పల పరిసరాల్లోకి వెళ్లి బుజ్జీ నువ్వులేకుండా నేను జీవించలేను, అందుకే చనిపోవాలని పురుగుల మందు తాగుతున్నానంటూ సెల్ఫీ వీడియో తీసి.. ఆ వీడియోను కుటుంబ సభ్యులకు, మరి కొంత మందికి పంపి వెంటనే ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు.

పోలీసుల ముమ్మర గాలింపు

అట్టే పోతలయ్య ఆత్మహత్యకు పాల్పడుతున్నానంటూ పంపిన సెల్ఫీ వీడియోను చూసిన కుటుంబ సభ్యులు శనివారం రాత్రి 11 గంటల సమయంలో రాప్తాడు పోలీస్‌స్టేషన్ వద్దకు వచ్చారు. సీఐ శ్రీ హర్షకు విషయం తెలిపారు. దీంతో ఆయన పోతలయ్య ఆచూకీ కోసం సెల్‌ఫోన్ చివరి లొకేషన్ పరిశీలించగా శనివారం సాయంత్రం 4:30 గంటలకు పుట్లూరు మండలం అరకటివేముల లొకేషన్ చూపింది. వెంటనే రాప్తాడు, నార్పల పోలీసులు కలిసి అక్కడికి వెళ్లి పరిశీలించగా ఎవరూ కనిపించలేదు. పోతలయ్య తల్లి అట్టే మాలమ్మ ఆదివారం ఉదయం రాప్తాడు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి తన కుమారుడు శనివారం మధ్యాహ్నం పొలానికి వెళుతున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడని, తర్వాత తిరిగి రాలేదని, ఆచూకీ తెలపాలని ఫిర్యాదు చేసింది. ఆ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం రాప్తాడు, నార్పల పోలీసు సిబ్బంది, పోతలయ్య కుటుంబ సభ్యులు పలు ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ తెలియరాలేదు.

నిర్లక్ష్యమే..?

- జ్వరంతో గతనెల 30న సర్వజన ఆస్పత్రిలో అడ్మిట్
- ఆరోగ్యం కుదుట పడకుండానే ఈనెల 3న డిశ్చార్జ్
- ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యలో రోడ్డు ప్రమాదం
- మళ్లీ ఆస్పత్రిలో చేరిక.. ఆదివారం మృతి
- నాగలక్ష్మి మరణంపై అడుగడుగునా నిర్లక్ష్యమని విమర్శలు



నాగలక్ష్మి మృతదేహం



ఆస్పత్రి వద్ద విషాదంలో మృతురాలి కుమార్తె, బంధువులు

అనంతపురం వైద్యం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): అనంత సర్వజనాస్పత్రి వైద్యుల నిర్లక్ష్యంతో ఓ మహిళ ప్రాణం పోయిందనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. కణేకల్లు మండలం సొల్లాపురం గ్రామానికి చెందిన నాగలక్ష్మి(40) జ్వరంతో బాధపడుతూ గతనెల 30న ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వచ్చారు. పరీక్షించిన డాక్టర్లు ఊపిరితిత్తుల్లో నెమ్ము ఉందని చెప్పి, మెడికల్ ఫిమేల్ వార్డులో అడ్మిషన్ పెట్టారు. మూడు రోజుల తర్వాత ఈ నెల 3న డిశ్చార్జ్ చేశారు. నాగలక్ష్మిని తీసుకుని ఆమె కుటుంబసభ్యులు స్వగ్రామానికి ఆటోలో బయల్దేరారు. మార్గమధ్యలో బెళుగుప్ప మండలం హనిమిరెడ్డిపల్లి సమీపంలో ఆటో బోల్తా పడింది. నాగలక్ష్మితోపాటు మరో నలుగురు గాయపడ్డారు. వీరందరినీ తిరిగి ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తెచ్చారు. నాగలక్ష్మితోపాటు ఆమె కుమార్తె వైశాలి మరో ముగ్గుర్ని ఎమర్జెన్సీ వార్డులోని డాక్టర్లకు చూపించారు. బాధితులకు అల్ట్రాస్కానింగ్, ఎక్స్‌రే, సిటీ స్కానింగ్ చేయాలని డాక్టర్లు సూచించారు. వారిని తీసుకెళ్లి స్కానింగ్ చేయించాల్సిన వైద్యసిబ్బంది ఎవరూ పట్టించుకోలేదు. దీంతో కుటుంబ సభ్యులే డ్యూటీలు చేశారు. అర్ధరాత్రివరకు స్కానింగ్ ప్రక్రియసాగింది. శనివారం ఉదయం నాగలక్ష్మిని జనరల్ సర్జరీ విభాగంలోని ఐసీయూకి తరలించారు. మిగిలి ముగ్గుర్ని డిశ్చార్జ్ చేశారు. అయితే నాగలక్ష్మి ఆరోగ్య పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందారు. రోడ్డు ప్రమాదంకంటే మునుపు ఉన్న జ్వరం, ప్లేట్‌లెట్స్ తగ్గడం వల్లే నాగలక్ష్మి మృతి చెందినట్లు డాక్టర్లు చెబుతున్నారు. రోడ్డు ప్రమాదంలో పైకి కనిపించే గాయాలు తప్ప, అంతర్గతంగా ఎలాంటి గాయాలు లేవని, కడుపులో నీరులాంటి ద్రవం మాత్రమే ఉందని వారు పేర్కొన్నారు. ఆరోగ్యం పూర్తిగా కుదుటపడకనే ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేయడం వల్లే తమ తల్లి మృతి చెందినట్లు కుమార్తె వైశాలి ఆరోపించారు.

ఎంత క్షోభ పడిందో...!

ఆస్పత్రిలో చేరినప్పటి(శుక్రవారం)నుంచి మరణించేంతవరకు నాగలక్ష్మి తీవ్ర క్షోభను అనుభవించారని కుటుంబ సభ్యులు వాపోయారు. స్థిమితంగా లేకుండా ఐవీ క్యాన్‌లాను, బీపీ చెకప్ కేబుల్‌ను లాగేయడం చేస్తూ వచ్చిందన్నారు. డాక్టర్లను అడిగితే ఆటోలో నుంచి పడ్డారు కదా అలాగే ఉంటుందని చెప్పారు. వేరే డాక్టర్లను పిలిపించాలన్నా పట్టించు కోలేదు. శనివారం అర్ధరాత్రి పరీక్షలు చేసి రక్తకణాలు తక్కువగా ఉన్నాయంటూ ఏఎంసీకి తరలించారని తెలిపారు. ఆదివారం ఉదయం వరకు నాగలక్ష్మికి ప్లేట్లెట్స్ ట్రాన్స్‌ఫ్యూజన్ పెట్టారు. అప్పటికే ఆమె కోమాలోకి వెళ్లింది. త ర్వాత కొద్ది సేపటికి మృతి చెందిందని బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. అయితే నాగలక్ష్మి తన ప్రాణాలను బిగబట్టి కుమార్తె వైశాలి కోసం ఎదురు చూసిందని, ఆమెను చూడగానే ప్రాణాలు విడిచిందని బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు.

న్యాయం చేయాలి..

నా భర్య నాగలక్ష్మి, కుమార్తె వైశాలి, బంధువులు లలితమ్మ, సూర్య, ఉలిగమ్మ రోడ్డు ప్రమాదంలో శుక్రవారం గాయపడ్డారు. అదేరోజు ఎమర్జెన్సీలో చూపించాం. స్కానింగ్‌లు, రక్తపరీక్షలు అన్నీ మేమే చేయించుకున్నాం. మాకెవరూ సాయపడలేదు. శనివారం ఉదయం నలుగురుని డిశ్చార్జ్‌చేసి నా భార్యను మాత్రం పైనున్న వార్డులో అడ్మిషన్ పెట్టారు. ఏమీ తగ్గకపోవడంతో విలవిల్లాడింది. పెద్ద డాక్టర్ ఎవరూ రాలేదు. బయటకుపోతాం. నా భార్యను బతికించుకుంటామని వేడుకున్నా పట్టించుకోలేదు. ఏమైందోకానీ శనివారం అర్ధరాత్రి రక్తపరీక్షలు చేశారు. రిపోర్టులు చూసి కిందనున్న ఏఎంసీ వార్డుకు పంపారు. రక్తకణాలు తక్కువగా ఉన్నాయని ఎక్కించారు. మధ్యలోనే నాభార్య చనిపోయింది. పేద కూలీలమైన మేము మా ఇద్దరు పిల్లల చదువులు మాన్పించి కూలి పనులకు పోతున్నాం. ఇప్పుడు నా భర్యకూడా పోయింది. మాకు న్యాయం చేయాలి.

-ఆదినారాయణ, నాగలక్ష్మి భర్త

విచారణ చేయిస్తాం..

నాగలక్ష్మి మృతిపై విచారణ చేయిస్తాం. ఎమర్జెన్సీ వార్డుకు ఎప్పుడు వచ్చారు. డ్యూటీలో డాక్టర్లు, సిబ్బంది, నర్సులు ఎవరున్నారు. వార్డులో ఎవరెవరున్నారో వివరాలు సేకరించి పనిచేయని వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. నాగలక్ష్మి మృతికి కారణాలను వెలికితీస్తాం.

- డాక్టర్ సుబ్రహ్మణ్యం, ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్



ఫ్లైఓవర్ కింద అనధికారికంగా వాహనాల పార్కింగ్



ఏర్పాటు చేసిన దుకాణాలు

స్మార్ట్ బజారు స్థలం ఆక్రమణ

- ఇష్టానుసారంగా వాహనాల పార్కింగ్
- అనధికారికంగా దుకాణాల ఏర్పాటు
- తొలగించాలని నోటీసులు ఇచ్చినా.. ఫలితం శూన్యం

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మహిళలకు స్వయం సహాయక సంఘాల ద్వారా స్మార్ట్ బజారు ఏర్పాటు చేసేందుకు నగరంలోని బళ్లారి రోడ్డులో గల జాతీయ రహదారి ఫ్లైఓవర్ కింద స్థలాన్ని ఎంపిక చేసింది. అయితే ఆ స్థలాన్ని కొందరు భారీ వాహనాల పార్కింగ్‌కు, దుకాణాల ఏర్పాటుకు ఆక్రమించేశారు. నగరపాలక సంస్థ అధికారులు ఇప్పటికే పలుమార్లు వాహనాలు పార్కింగ్ చేసిన వారికి, దుకాణాలు ఏర్పాటు చేసిన వారికి వెంట నే ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేశారు. అయినా ఫలితం లేకుండా పోయింది. ఇష్టానుసారంగా ఆటోమొబైల్ షాపులు, టీ కొట్లు ఏర్పాటు చేయడంతో చెత్తా, చెదారం పేరుకుపోయి అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. అంతేగాక దుకాణాలు, వాహనాల మధ్యలో పలువురు అసాంఘిక కార్యకలాపాలు సైతం నిర్వహిస్తున్నారు. ఇలాంటి వాతావరణంలో మహిళలు స్మార్ట్ బజారుల నిర్వహణ సాధ్యమేనా అనే సం దేహం వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా జాతీయ రహదారి బ్రిడ్జి కింద, నగరపాలక సంస్థకు చెందిన స్థలంలో విచ్చలవిడిగా దుకాణాల ఏర్పాటు, అనుమతి లేకుండా వాహనాల పార్కింగ్ పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

కల్లూరులో ఆటోడ్రైవర్ల సంబరాలు



కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు, ఆటో డ్రైవర్లు

గార్లదిన్నె, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సేవలో పథకాన్ని అములు చేయడంతో మండలంలోని కల్లూరు గ్రామంలో ఆదివారం ఆటో డ్రైవర్లు, టీడీపీ నాయకులు కలిసి సంబరాలు జరుపుకున్నారు. సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేసి, కేక్ కట్ చేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. ఇచ్చిన మాట ప్రకారం సీఎం చం ద్రబాబు ఆటోడ్రైవర్లకు ఒక్కొక్కరికి రూ. 15వేలు ఖాతాలోకి వేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుధాకర్ రెడ్డి, కోమలినారాయణరెడ్డి, ఆటో యూనియన్ లీడర్ మూర్తి, ఎర్రిస్వామి, సూరి, నబీ, శ్రీరాములు పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.18

అనంతపురం రూరల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో ఆదివారం టమోటాలు కిలో గరిష్ఠంగా రూ.18తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.9వేలు, సరాసరిగా రూ.12తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 3వేల టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

ఘనంగా ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు

గార్లదిన్నె, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆర్ఎస్ఎస్ (రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్) శతాబ్ది ఉత్సవాలను మండలకేంద్రంలోని అయ్యప్ప స్వామిఆలయ సమీపంలో ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. నాయకులు మారుతి గోవిందప్ప, ప్రసాద్, నరేంద్ర, వడ్ల రవిబాబు, రామాంజినేయులు ముఖ్య అతిథులుగా హాజరై వందన సమర్పణ చేశారు. అనంతరం మాట్లాడుతూ... గ్రామాల్లో ప్రతి యువకుడు ఆర్ఎస్ఎస్‌లో చేరాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కొనిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ప్రవీణ్, ప్రతాప్‌రెడ్డి, ఆచారి, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ కాలనీలో కంటి వైద్యశిబిరం

అనంతపురం రూరల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజీవ్ కాలనీలో ఆదివారం కోదండ రామాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటైంది. ఐమిత్ర విజన్ సెంటర్స్ అండ్ ఫార్మసీ సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా వైద్యనిపుణులు పంచాయతీ పరిధిలోని ప్రజలకు ఉచితంగా కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

అంకారావుకు అవార్డు



డాక్టర్ మొగిలి అంకారావు

అనంతపురంరూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూఏ ఎగ్జామినేషన్ అడిషనల్ కంట్రోలర్ డాక్టర్ మొగిలి అంకారావుకు ఇంటర్నేషనల్ ఇన్‌స్పిరేషనల్ టీచర్ అవార్డు దక్కింది. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇంటర్ నేషనల్ ఎక్స్ లెన్స్ కంపెనీ ఈ అవార్డు ప్రదానం చేసింది. ఈసందర్భంగా ఆయనకు వర్సిటీ వీసీ సుదర్శనరావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య, ఓఎస్‌డీ టూ వీసీ దేవన్న, డైరెక్టర్లు తదితరులు అభినందించారు. అవార్డు దక్కడం పట్ల అంకారావు సంతోషం వ్యక్తం చేశారు.

పారా స్విమ్మింగ్ క్రీడాకారుల ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి పారా స్విమ్మింగ్ క్రీడాకారులను ఎంపిక చేశారు. జిల్లా పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రామ్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ స్విమ్మింగ్ అకాడమీలో పారా స్విమ్మింగ్ జిల్లా స్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. పోటీల్లో ఎంపికైన పారా స్విమ్మింగ్ క్రీడాకారుల వివరాలను జిల్లా పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాసులు ప్రకటించారు. బాలాజీ, చిన్న, రిషిరెడ్డి, శ్రీనివాస్, నాగేష్, మోహన్‌కృష్ణ ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులు ఏలూరులో ఈనెల 12న జరిగే ఏడో రాష్ట్రస్థాయి పారా స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శివప్ప పాల్గొన్నారు.

ఘనంగా అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన దృశ్యం

గార్లదిన్నె, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బూదేడు గ్రామంలో ఏర్పాటు చేసిన బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆదివారం గ్రామస్థులు ఘనంగా ఆవిష్కరించారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటాన్ని గ్రామ వీధులలో ఊరేగించారు. విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఒక్క కులానికి, ఒక వర్గానికి చెందిన వాడుకాదని అందరి వాడని అన్నారు. ఆయన విగ్రహాన్ని గ్రామంలో ఏర్పాటు చేయడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో సర్పంచు శివయ్య, మాజీ సర్పంచు రామన్నచౌదరి, కులసంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు ఓబుళపతి, గంగాధర్, రామాంజి, మల్లికార్జున, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వానొస్తే.. మడుగే

- యర్రగుంటలో ప్రధాన రహదారిపై నిలుస్తున్న వర్షపు నీరు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు, స్థానికులు



వాల్మీకి విగ్రహం వద్ద రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు (ఫైల్)

రాప్తాడు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): వర్షం పడితే చాలు మండలంలోని యర్రగుంట గ్రామంలో గల ప్రధాన సీసీ రోడ్డు మడుగులా తయారవుతోంది. ముఖ్యంగా వాల్మీకి విగ్రహం ఎదుట నీరు అధికంగా నిలుస్తున్నాయి. వర్షపు నీరు పక్కకు వెళ్లే మార్గం లేక అక్కడే నిలుస్తున్నాయి. అదే రోడ్డుపై గ్రామ చివర్లో కూడా వర్షపు భారీగా నిల్వ ఉంటున్నాయి. ఈ దారి గుండా ద్విచక్ర వాహనాలు, ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు పాఠశాలల బస్సులు, ఇతర వాహనాలు నిరంతరం రాకపోకలు సాగిస్తుంటాయి. మడుగులాంటి ఆ నీటిలో వెళ్లాలంటే వాహనదారులు, గ్రామస్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వర్షం వచ్చిన ప్రతిసారీ మాకు ఈ ఇబ్బంది తలెత్తుతోందని, అధికారులు, ప్రజా ప్రతి నిధులు స్పందించి ప్రధాన రహదారిపై వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

శాస్త్రోక్తంగా వేంకటేశ్వరుడి కల్యాణం



కల్యాణోత్సవంలో మాంగల్యం చూపుతున్న వేదపండితులు

అనంతపురం టౌన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): శారదానగర్‌లోని శివబాల యోగి ఆశ్రమంలో ఆదివారం వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు ఆలయ ఆవరణలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరుడి ఉత్సవమూర్తులకు భక్తుల చేత ప్రాకారోత్సవం, చక్రస్నానం చేయించారు. అనంతరం విశేషంగా అలంకరించి, వేద మంత్రోచ్చారణల నడుమ కల్యాణోత్సవాన్ని జరిపారు. ఆశ్రమ కమిటీ అధ్యక్షుడు జూటూరు అరవింద్, ఉపాధ్యక్షుడు రత్నగిరి దేవరాజ్, సభ్యులు పాల్గొన్నారు.

రెండు ఇళ్లలో చోరీ

- 6 తులాల బంగారు నగల అపహరణ

బుక్కరాయసముద్రం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని దక్షిణ మూర్తి నగర్‌లో గల రెండు ఇళ్లలో చోరీ జరిగింది. పోలీసులు, బాధితులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. దక్షిణామూర్తి నగర్‌కు చెందిన దాసా అనిల్‌కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి దసరా పండుగకు అదే కాలనీలోని బంధువుల ఇంటికి వెళ్లారు. ఈ క్రమంలో వారి ఇంటికి తాళం వేసి ఉండడంతో... దొంగలు శనివారం రాత్రి చొరబడిలో 5 తులాల బంగారు నగలను దొంగలించారు. అలాగే పక్కనే ఉన్న దాసరి అశోక్ ఇంట్లో కూడా దొంగలు చొరబడి ఒక తులం బంగారాన్ని చోరీ చేశారు. దాసరి అశోక్ కూడా కుటుంబసభ్యులతో బంధువుల ఊరు అయిన జంతులూరుకు వెళ్లాడు. వారి ఇంటిలో కుక్క ఉండడంతో అది అరవకుండా బిస్కెట్‌లోకి మత్తుపదార్థం పెట్టి లోపలికి వెళ్లారు. ఆదివారం విషయం తెలుసుకున్న బాధితులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

9 నుంచి సాంస్కృతికోత్సవాలు

అనంతపురం టౌన్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) రాష్ట్ర 16వ మహాసభలను పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని కృష్ణకళామందిర్‌లో ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు సాంస్కృతికోత్సవాలను నిర్వహించనున్నట్లు ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి తెలిపారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్లను స్థానిక ఎన్జీఓ హోం ఆవరణలో ఆదివారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఈనెల 13, 14, 15వ తేదీల్లో జిల్లా కేంద్రంలోని ఎంకేఎం ఫంక్షన్‌హాల్‌లో రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో 9 నుంచి 11వ తేదీ వరకు సాయంత్రం 5:30 నుంచి రాత్రి 8:30 గంటల వర కు సాంస్కృతికోత్సవాలు జరపనున్నామన్నారు. జిల్లాలోని డ్యాన్స్‌మాస్టర్లు, కవులు, కళాకారులు, ఉద్యోగులు, ప్రజలు పెద్దఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు శ్యామల, నగర కార్యదర్శి అశ్విని, జిల్లా నాయకురాలు రామాంజినమ్మ, డ్యాన్స్‌మాస్టర్లు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతికి నివాళి



సకల నాగరాజు కుటుంబసభ్యులకు ఆర్థిక సాయం చేస్తున్న రామలింగారెడ్డి

బుక్కరాయసముద్రం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్దరాంపురం గ్రామపంచాయతీలో గల ఎ. కొండాపురానికి చెందిన టీడీపీ కార్యకర్త సకల నాగరాజు అనారోగ్యంతో గత శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి గ్రామానికి వెళ్లి ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అలాగే కుటుంబసభ్యులను పరామర్శించి రూ. 10 వేలు ఆర్థికసాయం అందజేశారు. అనంతరం వెంకటాపురం గ్రామానికి వెళ్లి ఇటీవలే రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కార్యకర్త ఖలీద్‌ను పరామర్శించి వైద్య చికిత్సల నిమిత్తం రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు అక్కులప్ప, వడ్డే సుంకన్న, నూర్‌బాషా, బోయపాటి చెన్నమయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం



బ్యాటింగ్ చేసి టోర్నీని ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆర్డీటీ స్టేడియంలో చేపట్టిన జేశాప్ క్రికెట్ టోర్నమెంట్‌ను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, అనంత అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌తో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జర్నలిస్టులు రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలను నిర్వహించడం ఐక్యతకు స్ఫూర్తిగా, ఆదర్శంగా నిలుస్తోందన్నారు. విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్, జగన్మోహన్ మాట్లాడుతూ జర్నలిస్టులు అనంతలో రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలు నిర్వహించడం శుభపరిణామమని అన్నారు. అనంతరం బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ చేసి ప్రజాప్రతినిధులు సందడి చేశారు. కార్యక్రమంలో జేశాప్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, గౌరవాధ్యక్షుడు రేపటి రామాంజనేయులు, కార్యదర్శి జగదీష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటరెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్


పాల్తూరు సబ్‌స్టేషన్‌లో క్షీరాభిషేకం చేస్తున్న రైతులు

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుపై సంబరాలు

విడపనకల్లు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాల్తూరు విద్యుత్ సబ్ స్టేషన్‌లో రైతుల కోసం కొత్త విద్యుత్ ట్రాన్స్ ఫార్మ ర్‌ను అధికారులు శనివారం ఏర్పాటు చేశారు. గతంలోని 5ఎంవీఏ ట్రాన్స్ ఫార్మర్ ఉండటం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత మంత్రి పయ్యావుల కేశవ్ దృష్టికి విద్యుత్ సమస్యను మండల రైతులు, టీడీపీ నాయకులు తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి విడపనకల్లు, పీల్తూరు రెండు సబ్ స్టేషన్లకు 8ఎంవీఏ సామర్థ్యంగల ట్రాన్స్‌ఫార్మర్లను మంజూరు చేయించారు. పాల్తూరులో కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను శనివారం ఏర్పాటు చేయగా.. ఆ సబ్‌స్టేషన్ కింద ఉన్న గ్రామాల రైతులు ఆదివారం సంబరాలు చేసుకున్నారు. పాల్తూరులో సబ్‌స్టేషన్‌లో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి కేశవ్ చిత్రపటాలకు రైతులు ఆదివారం క్షీరాభిషేకం చేశారు. గాజులమల్లాపురం శివాలయంలో రైతులు పూజలు చేశారు.

ఆర్‌ఎస్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం


మాట్లాడుతున్న మధుకర్

కూడేరు,అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): ఆర్‌ఎస్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కూడేరులో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆర్‌ఎస్‌ఎస్ స్టేట్ ప్రధాన కార్యదర్శి మధుకర్ మాట్లాడుతూ.. దేశసేవే ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్, చిరంజీవి, ప్రతాప్‌రెడ్డి, ఆంజినేయులు, మండల అధ్యక్షుడు ఇప్పేరు నాగరాజు పాల్గొన్నారు.

16న టౌన్‌బ్యాంక్ ఎన్నికలకు నోటిఫికేషన్

తాడిపత్రి, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): తాడిపత్రి కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ పాలకవర్గం సభ్యుల ఎన్నికలకు ఈ నెల 16న నోటిఫికేషన్ విడుదల చేస్తున్నట్లు సీఈఓ శివలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరో తేదీన బ్యాంక్ సభ్యుల ఓటర్ల జాబితాను బ్యాంక్ నోటీసు బోర్డులో ప్రదర్శిస్తామని, 13వ తేదీ వరకు మార్పులు, చేర్పులకు అవకాశముంటుందని తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్, ఓటు హక్కు ఉన్న సభ్యుల జాబితా 16న విడుదల చేస్తామని, 23న నామినేషన్ల స్వీకరణ, 24న పరిశీలన, 25న ఉపసంహరణ, 29న పోలింగ్ ఉంటుందని తెలిపారు.

ఉపాధి కూలీలకు ఈకేవైసీ తప్పనిసరి

పుట్లూరు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకంలోని ప్రతి కూలీ తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని డ్వామా పీడీ సలీంబాషా స్పష్టం చేశారు. మండలంలోని సూరేపల్లి, కడవకల్లు, అరకటవేముల గ్రామాల్లో ఆదివారం చేపట్టిన ఈకేవైసీ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఉపాధిహామి పథకంలో ఎలాంటి అవినీతి జరగకుండా ఈకేవైసీ చేస్తున్నామన్నారు. ఆయన వెంట ఏపీడీ పుల్లారెడ్డి, ఏపీఓ తులసీప్రసాద్, ఈసీ అంజన్‌కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

● యల్లనూరు : మండలంలోని తిమ్మంపల్లిలో కూలీలకు ఈకేవైసీ చేస్తున్న విధానాన్ని డ్వామా పీడీ పరిశీలించారు. ఆయన వెంట ఏపీఓ ఓబిరెడ్డి, ఈసీ సత్యబాబు, టెక్నికల్ అసిస్టెంట్లు ఉన్నారు.

● పెద్దపప్పూరు: మండలంలోని ముచ్చుకోట, వరదాయపల్లి గ్రామాల్లో ఈకేవైసీ జరుగుతున్న తీరును డ్వామా పీడీ పరిశీలించారు. ఆయన వెంట టీఏలు శ్రీనివాసులు, భాస్కర్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ బాబురెడ్డి ఉన్నారు.

శిథిలావస్థలో అతిథిగృహం


శిథిలావస్థలో ఉన్న అతిథి గృహం

కూడేరు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నాహోబిళం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్ డ్యాం) లో అతిథి గృహం శిథిలావస్థకు చేరుకుంది. డ్యాం నిర్మాణ సమయంలో నిర్మించిన ఆ అతిథి గృహం నిర్వహణ సరిగా లేకపోవడం.. మరమ్మతులు చేయకపోవడంతో శిథిలావస్థకు చేరింది. డ్యాంను సందర్శించేందుకు వచ్చిన అతిథితులతో పాటు అధికారులు ఈ అతిథి గృహంలో విశ్రాంతి తీసుకునేవారు. ప్రభుత్వాలు మారినా.. దీని మరమ్మతులకు నిధులు కేటాయించకపోవడతంతో ఆ భవనం దెబ్బతింది. ప్రసుత్తం అతిథి గృహం చుట్టూ కంపచెట్లు పెరిగి అపరిశుభ్రంగా మారింది. ఉన్నతాధికారులు స్పందించి ఈ భవనానికి మరమ్మతులు చేయించి.. వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


అతిథి గృహం నుంచి డ్యాం గేట్ల వద్దకు వెళ్లే దారి

పొంచి ఉన్న ప్రమాదం


రోడ్డుపక్కన ఒరిగిన విద్యుత్ స్తంభం

బ్రహ్మసముద్రం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయలప్పదొడ్డి సబ్ స్టేషన్ నుంచి బొమ్మగానిపల్లి వెళ్లే 11 కేవీ విద్యుత్ లైన్ స్తంభాన్ని రెండు నెలల క్రితం ఒక ట్రాక్టర్ ఢీకొంది. దీంతో ఆ విద్యుత్ స్తంభం పూర్తిగా పక్కకు ఒరిగింది. ప్రధాన రోడ్డు పక్కనే ఈ స్తంభం ఉండటంతో ఏ క్షణంలోనైనా అది కూలిపోయే ప్రమాదముంది. విద్యుత్ అధికారులు స్పందించి.. ప్రమాదం జరగక ముందే ఆ స్తంభాన్ని సరిచేయాలని వాహనదారులు కోరుతున్నారు.

పల్లెకు అందని వైద్యం

నిరుపయోగంగా విలేజ్ హెల్త్ క్లినిక్‌లు


మూసివున్న గోనేహాళ్‌లోని విలేజ్ క్లినిక్

బొమ్మనహాళ్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో మండలంలో 15 విలేజ్ హెల్త్ క్లీనిక్‌లకు గాను 12 క్లీనిక్‌లకు భవనాలను ఏర్పాటు చేసింది. శ్రీధరఘట్ట, ఉద్దేహాల్, నేమకల్లులో భవనాలను నిర్మించలేదు. ఏర్పాటు చేసిన 12 విలేజ్ హెల్త్ క్లీనిక్‌ల్లో సిబ్బంది సమయపాలన పాటించడం లేదు. ఎవరు... ఎప్పుడు.. విధులకు వస్తారో తెలీక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని విలేజ్ హెల్త్ క్లీనిక్‌లను ఒక్కోరోజు అసలు తెరవడమే లేదు. కొన్ని గ్రామాల్లో సిబ్బంది హాజరుకాకుండా ఆశా కార్యకర్తలతో క్లీనిక్‌లను తెరిపించి మమ అనిపిస్తున్నారనే ఆరోపణలున్నాయి. సిబ్బంది నామమాత్రంగా విధులకు హాజరవుతున్నారు. జిల్లా కేంద్రానికి ఈ మండలం 100 కిలోమీటర్ దూరంలో ఉండడంతో ఉన్నతాధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. పీహెచ్‌సీ వైద్యులు కూడా పట్టించుకోకపోవడంతో ఈ దుస్థితి ఏర్పడింది. గ్రామాల్లో వైద్య సేవలు అందకపోవడంతో గ్రామస్థులు ఆర్‌ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. అత్యవసర వైద్యం కోసం పట్టణాలకు పరుగులు తీస్తున్నారు. దీంతో చిన్నపాటి జ్వరాలకూ గ్రామస్థులు ఉరవకొండ, బళ్లారి, రూపానగుడి ప్రాంతాలకు వెళ్తున్నారు. కాగా, దేవగిరిలో ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎం, కురువళ్లిలో ఏఎన్‌ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

సైఫుల్లా క్రికెట్ టోర్నీ విజేత ఆర్డీటీ


విజేతలకు కప్పును అందజేస్తున్న నిర్వాహకులు

కణేకల్లు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పదిరోజులుగా నిర్వహిస్తున్న సైఫుల్లా క్రికెట్ టోర్నీలో ఆర్డీటీ జట్టు విజేతగా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్‌మ్యాచ్‌లో కణేకల్లు ఆర్డీటీ జట్టు, కొండాపురం జట్టు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన ఆర్డీటీ జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 123 పరుగులు చేయగా.. అనంతరం బ్యాటింగ్ చేసిని కొండాపురం జట్టు 9 వికెట్లు కోల్పోయి 98 పరుగులు మాత్రమే చేసింది. విజేత ఆర్డీటీ జట్టుకు రూ. 20 వేలు, రన్నర్ కొండాపురం జట్టుకు రూ. 10 వేలతో పాటు ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో పీడీ గోపాల్‌రెడ్డి, ఉపసర్పంచ్ నబీసాబ్, టీకే సర్మాస్, మోహన్, క్రీడాకారులు రాజేష్, పురుషో త్తం, నిర్వాహకులు మణికంఠ, సాయిరెడ్డి, నితీష్, రాజశేఖర్ పాల్గొన్నారు.

బకాయిలు ఇప్పించాలని పెన్షనర్ల వినతి


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న పెన్షనర్లు

తాడిపత్రి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): తమకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలను వచ్చేలా చర్యలు తీసుకోవాలని పట్టణంలోని పెన్షనర్లు ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డికి ఆదివారం వినతి పత్రం అందజేశారు. పెన్షనర్లకు అడిషనల్ క్వాంటం పెంపు, డీఏ బకాయిలు చెల్లింపు, పీఆర్‌సీ వెంటనే ప్రకటించాలని, ఐఆర్ గురించి ప్రకటన, హెల్త్ కార్పొరేషన్ ఏర్పాటు, ఐహెచ్ఎస్ పరిమితి రూ.5లక్షలు పెంచాలని కోరారు. ఎమ్మెల్యే స్పందించి సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్తానన్నారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు సత్యప్రకాష్‌రెడ్డి, వీరారెడ్డి, నారాయణస్వామి, రంగయ్య పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక తరలింపు

నంబర్ ప్లేటులేని ట్రాక్టర్లలో రవాణా


నంబరు ప్లేటు లేని ట్రాక్టర్లలో తరలిస్తున్న ఇసుక

విడపనకల్లు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొంత మంది టీడీపీ, వైసీపీ నాయకులు కలిసి ఇసుక అక్రమ వ్యాపారానికి తెరలేపారు. రోజుకు రూ లక్షలు గడిస్తున్నారు. బొమ్మనహాలు మండలం బొల్లనగుడ్డం, కందేపల్లి, కణేకల్లు మండలంలోని పలు ప్రాంతాల నుంచి రోజూ పగలు, రాత్రి అనే తేడా లేకుండా అక్రమంగా ఇసుకను వందలాది ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. ఈ ఇసుక ట్రాక్టర్లు పాల్తూరు, కరకముక్కల మీదుగా మండలానికి చేరుకుంటున్నాయి. ఏ ఒక్క ట్రాక్టర్‌కూ నంబరు ప్లేటు ఉండదు. మండల అధికారుల కళ్లెదుటే ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇక్కడి నుంచి వివిధ గ్రామాలకు పక్కనే ఉన్న కర్ణాటకకు ఆ ఇసుకను తరలిస్తున్నారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

గుత్తిరూరల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండపాడులో వాల్మీకి జయంతి సందర్భంగా ఆదివారం జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభించారు. ఈ పోటీల్లో 54 టీములు పాల్గొన్నాయి. మొదటి బహుమతిగా రూ.25 వేలు, రెండవ బహుమతిగా రూ.15వేలు, మూడో బహుమతిగా రూ.8 వేలు, నాలుగో బహుమతిగా రూ.5 వేలు ఇస్తామని కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఇందులో టీడీపీ మండల కన్వీనర్ లక్ష్మిరంగయ్య, టీడీపీ నాయకులు చిన్నరెడ్డి యాదవ్, ఓంప్రకాష్, రామాంజునేయులు, ప్రకాష్ పాల్గొన్నారు.

ఆలయ పరిసరాల పరిశీలన


ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న జేసీపీఆర్

పెద్దపప్పూరు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని అశ్వర్థనారాయణస్వామి ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం ఇటీవల రూ.8 కోట్లు మంజూరు చేసింది. దీంతో ఆ ఆలయాన్ని, పరిసరాలను తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. అదే తరుణంలో మండలంలోని బొందలదిన్నెలో ఓ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి వస్తున్నట్లు సమాచారాన్ని తెలుసుకున్న టీడీపీ శ్రేణులు పెద్దఎత్తున అశ్వర్థం చేరుకున్నారు. దీంతో పోలీసులు పెద్దారెడ్డిని హౌస్ అరెస్ట్ చేయడంతో పరిస్థితి సద్దుమణిగింది.

కసాపురంలో మన్యుసూక్త హోమం


అభిషేకం చేస్తున్న అర్చకులు

గుంతకల్లుటౌన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయం లో ఆదివారం పూర్వ భాద్ర తిరునక్షత్రము సందర్భంగా మన్యుసూక్త హో మం నిర్వహించారు. ఆలయంలోని యాగశాలలో ఆంజనేయస్వామి ఉత్సవమూర్తిని కొలువుదీర్చి.. వేదపండితులు, అర్చకులు ఉత్సవ మూర్తికి తిరుమంజన స్నపన, మన్యుసూక్త హోమం, పూర్ణాహుతి నిర్వహించారు.

నేడు దివ్యాంగులకు శిబిరం

యాడికి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలో 18 ఏళ్లలోపు ఉన్న దివ్యాంగులకు ఉపకరణాల ఎంపిక కోసం స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో సోమవారం శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ కాశప్ప ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ఎంపికైన వారికి రోటేటర్, వీల్‌ఛైర్, ట్రైసైకిల్, వినికిడి యంత్రం, బుద్ధిమాంద్యత కిట్లు మొదలగు ఉపకరణాలు అందజేస్తామన్నారు. ఈ శిబిరానికి వచ్చే వారు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, సదరం సర్టిఫికెట్, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు తీసుకురావాలన్నారు.

● తాడిపత్రి : స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో దివ్యాంగుల విద్యార్థులకు ఉపకరణాల ఎంపిక క్యాంప్‌ను సోమవారం నిర్వహిస్తున్నట్ల ఎంఈఓ నాగరాజు తెలిపారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పెన్షనర్ల కార్యవర్గం ఏకగ్రీవం

రాయదుర్గం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ సంఘం కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఈ రామాంజినేయులు, ప్రధాన కార్యదర్శిగా జీ సత్యనారాయణ, అసోషియేట్ అధ్యక్షుడిగా ముత్యాలరెడ్డి, ఉపాధ్యక్షులుగా నారాయణరెడ్డి, గోవిందరాజులు, శాంతిరాజు, వీరభద్రయ్య, కోశాధికారిగా నాగరాజుశెట్టి, సహాయ కార్యదర్శులుగా అబ్దుల్‌బారీ, సంజీవ్‌రెడ్డి, గోపాలకృష్ణ, సిద్ధప్ప, కార్యవర్గ సభ్యులుగా ఉమాపతి, శివప్ప, రామస్వామి, జలజాక్షి, గోవిందరాజులు, అబ్దుల్ రెహిమాన్, నాగరాజు, ప్రభాకర్, గురురాజప్రసాద్, నాగరాజు, వెంకటస్వామి, గంగాధర, గోవిందప్పను ఎన్నుకున్నారు.

● వాల్మీకి విగ్రహ కమిటీ..

కణేకల్లు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్ర వాల్మీకి విగ్రహ కమిటీని ఆ కులస్థులు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా లాలెప్ప, మోటయ్యగారి ఆంజినేయులు, సలహాదారుడిగా పోతన్న, అధ్యక్షుడిగా బీటీ రమేష్, ఉపాధ్యక్షుడిగా హనుమంతరాయుడు, కార్యదర్శిగా దాసరి చెన్నకేశవులు, జాయింట్ సెక్రెటరీగా మల్లికార్జున, కోశాధికారిగా సురేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మున్సిపల్ మాజీ వైస్ చైర్‌పర్సన్ మృతి


సరస్వతమ్మ (ఫైల్)

తాడిపత్రి, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ మాజీ వైస్ చైర్‌పర్సన్ సరస్వతమ్మ (50) అనారోగ్యంతో ఆదివారం మరణించింది. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె అనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించింది. ఆమె మృతికి ఎమ్మెల్యే జేసీ అశ్మిత్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు ప్రగాఢ సానుభూతి తెలిపారు.


సమావేశమైన పూర్వ విద్యార్థులు, గురువులు

పూర్వ విద్యార్థుల సమావేశం

ఉరవకొండ, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1999-2000 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు.. 25 ఏళ్ల తర్వాత అదే పాఠశాలలో ఆదివారం సమావేశమయ్యారు. నాటి గురువులను సత్కరించారు. ఇందులో జానకిరామ్, రమేష్, చంద్రశేఖర గౌడ్, తయూబ్, వరప్రసాద్, ఖలీల్ మంజు పాల్గొన్నారు.

క్రైం న్యూస్..

రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి మృతి


నాగప్రతాప్ (ఫైల్)

యాడికి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక చింతవనం వీధికి చెందిన కాసా రంగడు కుమారుడు, బీటెక్ విద్యార్థి కాసా నాగప్రతాప్ (19) రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఇతను గుత్తిలోని ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. శనివారం సాయంత్రం స్నేహితులతో కలిసి గుత్తిరోడ్డు వైపు వాకింగ్‌కు వెళ్లాడు. ఇంటికి తిరిగి వచ్చే సమయంలో ద్విచక్రవాహనం ఢీకొనడంతో నాగప్రతాప్ తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మరణించాడు. కేసు దర్యాప్తులో ఉంది.

చికిత్స పొందుతూ వ్యక్తి..

గుమ్మఘట్ట, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని 75 వీరాపురం గ్రామానికి చెందిన హరిజన నీలకంఠ (40) రాయదుర్గం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మరణించాడు. ఇతను మూడురోజుల క్రితం ద్విచక్రవాహనంలో వెళ్తూ.. ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. తలకు తీవ్ర గాయమైన అతను.. చికిత్స పొందుతూ కోలుకోలేక మరణించాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో బేల్దారి..


పెద్దన్న మృతదేహం

గుంతకల్లుటౌన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా మద్దికెర మండలం ఎడవలి గ్రామానికి చెందిన బెల్దారి పెద్దన్న (35) గుండె పోటుతో ఆదివారం మరణించాడు. పెద్దన్నను వదిలేసిన అతని భార్య.. తన పిల్లలతో కలిసి పుట్టింట్లో ఉంటోంది. దీంతో పెద్దన్న పట్టణంలోని తన బంధువుల వద్ద ఉంటూ బెల్దారి పనులకు వెళ్లేవాడు. నిత్యం తాగి.. ఎక్కడపడితే అక్కడ పడుకునేవాడు. ఆదివారం పెద్దన్న మరో వ్యక్తి కలిసి ఆలూరు రోడ్డులోని ఓ వైన్ షాపులో మందు తాగడానికి వెళ్లాడు. మద్యం సేవిస్తున్న పెద్దన్నకు గుండెపోటు రావడంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. ఇతని వెంట వచ్చిన వ్యక్తి అక్కడ నుంచి వెళ్లిపోయాడు. మృతదేహం ఆ వైన్‌షాప్ వద్దే పడివున్నా.. ఆ దుకాణదారులు పట్టించుకోకపోవడంపై మందుబాబులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. అక్కడ ఏర్పాటు చేసిన బండలను ధ్వంసం చేశారు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ సీఐ మనోహర్ ఘటన స్థలానికి చేరుకున్నారు. పెద్దన్న మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తామని సీఐ తెలిపారు.

వ్యక్తికి తీవ్రగాయాలు

గుంతకల్లుటౌన్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక దోనిముక్కల రోడ్డులో నివాసముంటున్న మహమ్మద్ హుసేన్ పెయింటింగ్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం అతను కొనకొండ్ల రోడ్డులో రైల్వే అండర్ బ్రిడ్జి గోడపైన కూర్చొని ఉండగా.. ఒక్కసారిగా కిందపడ్డాడు. గాయపడ్డ అతన్ని స్థానికులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొనసాగిన గాలింపు చర్యలు


గాలిస్తున్న సిబ్బంది

ఉరవకొండ, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొనకొండ్లకు చెందిన వ్యవసాయ కూలీ రామాంజినేయులు ప్రమాదవశాత్తు జారిపడి ఈ నెల 1న హంద్రీనీవా కాలువలో గల్లంతైన విషయం తెల్సిందే. అతని ఆచూకి కోసం ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం సభ్యులు గాలింపు చర్యలు చేపట్టారు. శనివారం రెవెన్యూ అధికారులు కాలువ వెంబడి గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం ఎస్‌డీఆర్‌ఎఫ్ గజ ఈతగాళ్లను రప్పించి, చాయాపురం నుంచి రాగులపాడు లిఫ్ట్ వరకూ గాలింపు చర్యలు కొనసాగించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు నరేష్, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృంద సభ్యులు పాల్గొన్నారు.

వరుస చోరీలు

రాయదుర్గంరూరల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక ఇండేన్ గ్యాస్ గోడౌన్ సమీపంలో పక్కనపక్కనే ఉన్న రెండు ఇళ్లు, ఒక దేవాలయంలో శనివారం రాత్రి చోరీలు జరిగాయి. షమీవుల్లా కర్ణాటకలోని చెళ్లకెరకు కుటుంబసభ్యులతో కలిసి శుక్రవారం రాత్రి వెళ్లాడు. శనివారం అర్ధరాత్రి దుండగులు ఆ ఇంటి తాళం పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఆదివారం మధ్యాహ్నం వచ్చి చూడగా బీరువాలోని రూ. 50 వేలు, 20 గ్రాముల బంగారం, 300 గ్రాములు వెండి చోరీ అయినట్లు గుర్తించాడు. అదే విధంగా అతని ఇంటి పక్కనే ఉన్న బాషా ఇంటి తాళాలూ పగలగొట్టిన దుండగులు రూ. 50 వేలు నగదు, ఐదు గ్రాముల బంగారం, 500 గ్రాముల వెండి వస్తువులు ఎత్తుకెళ్లారు. అనంతరం పక్కనే ఉన్న ఆలయంలోని హుండీని దుండగులు ఎత్తుకెళ్లారు. ఆలయంలో ఎంత డబ్బు పోయింది అనే వివరాలు తెలియాల్సి ఉంది. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు బాధితులు తెలిపారు. కాగా, ఆ వీధిలో వీధిలైట్లు లేవని, చీకటిగా ఉంటోందని, దీంతో చోరీలు జరుగుతున్నాయని ఆ ప్రాంతవాసులు వాపోతున్నారు.

నిందితుడి అరెస్ట్

గుత్తి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని దేవాలయాల్లో చోరీలకు పాల్పడిన సతీష్‌నాయుడిని అరెస్ట్ చేశామని, అతని నుంచి రూ.11,598 స్వాధీనం చేసుకున్నామని సీఐ రామారావు ఆదివారం తెలిపారు. అతని స్వగ్రామం యాడికి మండలం గుడిపాడు గ్రామమని, ఇతను ఇటీవల గుత్తిఆర్ఎస్ తోలు షాపు వీధిలోని రాజరాజేశ్వరి దేవాలయంలో, మండలంలోని ఇసురాళ్లపల్లిలోని రాఘవేంద్రస్వామి దేవాలయంలో చోరీలకు పాల్పడ్డాడని తెలిపారు. నిందితుడ్ని అరెస్ట్ చేసి కోర్టు హాజరుపరిచి.. రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

తొమ్మిది మంది జూదరులు ..

డీ.హీరేహాళ్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడిశలపల్లి గ్రామ శివారు ప్రాంతంలోని ముళ్ల పొదల్లో పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని ఆదివారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ గురుప్రసాద్ రెడ్డి తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 18,450 స్వాధీనం చేసుకున్నామని, వారిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

అన్నదమ్ముల ఘర్షణ

తాడిపత్రి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతకోటలో ఆస్తివిషయంలో అన్నదమ్ములు రామాంజనేయులు, రవి ఆదివారం ఘర్షణ పడ్డారు. ఇంటి భాగపరిష్కారం విషయంలో మాటమాట పెరిగి కొట్టుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

రిజర్వాయర్‌కు 2,710 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): జీడిపల్లి రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో 2,710 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో 2,670 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు ఆదివారం వెల్లడించారు. రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.729 టీఎంసీల నీటి నిల్వ ఉందన్నారు.